


## పరిణయం.. పరమానందం..
## నయనానందకరంగా సీతారాముల కల్యాణం



**కోవూరు, జూన్14ప్రభాతవార్త :** కోవూరు మండలం గుమ్మలదిబ్బ గ్రామంలోని శ్రీ కోదండరామ స్వామి దేవస్థానంలో శుక్రవారం సీతారాముల కళ్యాణ కార్యక్రమాన్ని ఆలయ రుత్వికులు జనార్ధన్ సత్యనా రాయ ణ స్వామి ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రుత్వికులు సీతారాముల కళ్యాణ విశిష్టతను భక్తులకు వివరించారు. ఈ కళ్యాణ కార్యక్రమాన్ని కనులారా గాంచినా.. చెవులారా విన్నా మంచి జరుగుతుందని ఈ సందర్భంగా వారు కళ్యాణంలో పాల్గొన్న భక్తులకు తెలియజేశారు కోదండరాముడు , సీతమ్మ తల్లి పెళ్లికుమారుడు, పెళ్లికుమార్తెలుగా ఆశీనులైన వేళ ఆ కల్యాణ వేడుకను కనులారా వీక్షించిన భక్తజనం పులకించిపోయారు. ఈ కళ్యాణ వేడుకలో ఒక్కో ఘట్టాన్ని రుత్వికులు ఆసాంతం వివరిస్తూ సీతారాముల శిరస్సుపై జీలకర్ర బెల్లం మిశ్రమాన్ని సుముహూర్తం వేళ అలంకరించిన ఈ దృశ్యాన్ని చూసి భక్తులు పరవశులయ్యారు. మాంగల్యం తంతునా నేనా.. లోకరక్షణ హేతునా అనే మంత్రం వినిపించగానే సీతమ్మ వారిని కోదండరాముడు మంగళసూత్ర ధారణతో పరిణయమాడిన వేళ భక్తులు రెండు చేతులతో నమస్కరించారు.. అనంతరం సాంప్రదాయబద్ధంగా భక్తిశ్రద్ధలతో ఈ కార్యక్రమాన్ని కడుకమనీయంగా నిర్వహించారు. అనంతరం పాల్గొన్న భక్తులందరికీ అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఉభయకర్తలుగా వి. శ్రీనివాసులు, నరసమ్మ దంపతులు, వారి కుటుంబ సభ్యులు వ్యవహరించారు. ఈ కార్యక్రమానికి చుట్టుపక్కల ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## న్యాయవాదుల హర్షం



**నెల్లూరు క్రైం, జూన్ 14, ప్రభాతవార్త** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఎన్‌డిఎ కూటమి అధికారంలోకి వచ్చిన వెంటనే ల్యాండ్ టైటిల్ యాక్ట్‌ను రద్దు చేయడంతో నెల్లూరు నగరంలో న్యాయవాదులు సంబరాలు నిర్వహించారు. శుక్రవారం జిల్లా కోర్టు ప్రాంగణంలో జరిగిన కార్యక్రమంలో న్యాయవాదులు కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వ న్యాయవాది దాసరి రాజేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ ఇచ్చిన మాట ప్రకారం రద్దు చేసిన నారా చంద్రబాబు నాయుడుకి హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేశారు. బిజెపి ధార్మిక సెట్ జిల్లా కన్వీనర్ పూనమల్లి రామకృష్ణ, తెలుగు దేశం లీగల్ సెల్ నాయకులు శ్రీ హరి నారాయణ, చెన్నమనేని మురళి, నెల్లూరు న్యాయవాద సంఘం జెనరల్ సెక్రటరీ ఎం.సుందరయ్య యాదవ్ తదితర న్యాయమాదులు పాల్గొన్నారు.

## కనకదుర్గమ్మని దర్శించుకున్న ఆనం



నెల్లూరు, జూన్ 14, ప్రభాతవార్త – వైద్యం విజయవాడ ఇంద్రకీలాద్రిపై కొలువైన కనకదుర్గమ్మను రాష్ట్ర మంత్రి ఆనం రామనారాయణరెడ్డి శుక్రవారం అమ్మవారిని దర్శించుకున్నారు. వారికి పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. వేద పండితులు స్వాగతం పలికి, ప్రత్యేక పూజలు చేయించిన తరువాత వేదపం డితులు ఆశీర్వచనం చేశారు. ఆలయ ఈఓ రామారావు అమ్మవారి చిత్రపటం, శేష వస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు. వీరితో పాటు కొండ్రెడ్డి రితీష్ రెడ్డి, ఆనం కైవల్య రెడ్డి, తాళ్లూరు గిరి నాయుడు, కాటంరెడ్డి రవీంద్ర రెడ్డి, దేవకుమార్ రెడ్డి పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

## దేవాదాయ శాఖమంత్రిగా ఆనం రామానారాయణరెడ్డి



**ఆత్మకూరు, జూన్14, ప్రభాతవార్త :** ఆత్మకూరు అసెంబ్లీ నియో జకవర్గం నుంచి ఎన్‌డిఎ కూటమి అభ్యర్థిగా ఎమ్మెల్యేగా ఎన్నికై రాష్ట్రమంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన ఆనం రామనారా య ణరెడ్డికి దేవాదాయ శాఖను శుక్రవారం కేటాయించారు. గత ప్రభుత్వాల్లో ఐదుసార్లు వివిధ శాఖల మంత్రి పదవులను చేపట్టి న ఆనం రామనారాయణరెడ్డి 6వ దపా ఎన్‌డిఎ కూటమి సార ధ్యంలోని నారా చంద్రబాబు నాయుడు ప్రభుత్వంలో మరో సారి దేవాదాయ శాఖ లభించింది. దీంతో ఆత్మకూరు పట్టణం లోని బిఎస్ ఆర్‌సెంటర్‌తో పాటు నియోజకవర్గ పరిధిలోని అ న్ని మండల కేంద్రాల్లో ఆనం రామనారాయణరెడ్డి అభిమా ను లు, ఎన్‌డిఎ కూటమికి చెందిన తెలు గుదేశం, బిజెపి, జనసేన పార్టీ కార్యకర్తలు, నాయకులు, సంబరాలు జరుపుకున్నారు. ఆనం రామనారా యణరెడ్డి దేవాదాయ శాఖ మంత్రిగా సోమశిలలో తుఫాన్‌మూలంగా దెబ్బతిన్న సోమేశ్వరస్వామి ఆలయ జీర్ణోద్ధర పునర్నిర్మాణపనులు వేగవంతంగా ప్రారం భమవుతాయని, నియోజకవర్గ పరిధిలోని పలు దేవాలయాలు అభివృద్ధి చెందుతాయని నియోజకవర్గ ప్రజలు భావిస్తున్నారు.

## ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి



**ముత్తుకూరు, జూన్14, ప్రభాతవార్త** ఆరోగ్యంపై ప్రతి ఒక్కరూ ప్రత్యేక శ్రద్ధ కలిగి ఉండాలని ఆదాని కృష్ణపట్నం పోర్టు సీఓఓ రాజన్‌బాబు వెల్లడించారు. శుక్రవారం ఈ హెచ్‌ఎస్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో ఆదాని మెడికల్ సెంటర్, నెల్లూరు కిమ్స్ , హాస్పిటల్ సంయుక్తంగా ఆదాని మెడికల్ సెంటర్‌లో మెగా వైద్య శిభిరం నిర్వహించారు. ఈ వైద్య శిబిరానికి ముఖ్యఅతిధిగా ఆదాని కృష్ణపట్నం పోర్టు సీఓఓ రాజన్‌బాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపి తరచు వైద్య పరీక్షలు నిర్వహించుకుని ఆరోగ్యంగా ఉండాలని సూచించారు. ఈ మెగా వైద్య శిబిరంలో జనరల్ విభాగంతోపాటు గుండెకు సంబంధించి పరీక్షలు నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో 125మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ నాగరాజు, రవికిరన్, ఈహెచ్‌ఎస్ హెడ్ వేణుగోపాల్‌రెడ్డి, మనీష్ దావే, నాగరాజు, జయలాల్, వెంకట్రావు , ఈహెచ్‌ఎస్ డిపార్ట్‌మెంట్ రాంబాబు, శ్రీనివాస్, మధుసూధన్ తదితరులు పాల్గొన్నారు.

## మంత్రి ఆనంకి శుభాకాంక్షలు తెలిపిన జొన్నవాడ ఇఒ



**బుచ్చి జూన్ 14 ప్రభావార్త** రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన మంత్రి ఆనం రామనా రాయణరెడ్డికి పవిత్రపుణ్యక్షేత్రమైన జొన్నవాడలోని శ్రీమల్లికార్జునస్వామి , కామాక్షితాయి దేవస్దానం ఇఒ విరు పార్ఝుల గిరికృష్ణ శుభాకాంక్షలు తెలి పారు. మంత్రికి శాలువా కప్పి పూల మాలలు వేసి సత్కరించి జొన్నవాడ క్షేత్రానికి వచ్చి స్వామి అమ్మవార్లను దర్శించుకోవలసిందిగా ఆహ్వానించారు. ప్రసాదాలు అందజేశారు.

# చంద్రబాబుతోనే రామరాజ్యం



**కోవూరు, జూన్14ప్రభాతవార్త :** రాష్ట్రం ఈ ఐదేళ్ల పాటు అన్ని రంగాల్లో అభివృద్ధి , సంక్షేమం పరు గులు తీస్తుందని, ఇందుకు ముఖ్యమంత్రిగా బాధ్య తలు స్వీకరించిన చంద్రబాబు నాయుడుతోనే అది సాధ్యమని రాష్ట్ర ప్రజానీకం ఎన్డీఏ కూటమికి 164 సీట్లు ఇచ్చి పట్టం కట్టారని కోవూరు ఎమ్మెల్యే వేమి రెడ్డి ప్రశాంతిరెడ్డి అన్నారు. కోవూరులోని ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాలను నెరవేర్చేందుకు ముఖ్యమంత్రి ప్రత్యేక దృష్టి పెట్టారన్నారు. ముందుగా మెగా డీఎస్సీపై తొలి సంతకం చేసి నిరుద్యోగుల్లో ఆశలు రేపా రన్నారు. అదేవిధంగా ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌ను రద్దు చేసి రైతులకు ఎంతో మేలు చేశారన్నారు. చెప్పిన మాటకు కట్టుబడి పింఛన్లు పెంపుదల చేయడమే కాకుండా ఏప్రిల్ , మే, జూన్ నెలలకు సంబంధించిన పెంచిన వెయ్యి రూపాయలతో కలిసి 7 వేల రూపాయలను జూలై 1వ తేది అంద జేస్తా రన్నారు. అదేవిధంగా ఎంతోమంది కార్మికులకు, యువతకు అన్నా క్యాంటీన్ల ద్వారా తక్కువ ధరకే అందించేలా ప్రస్తుత ముఖ్యమంత్రి చర్యలు తీసుకు న్నారన్నారు. అదేవిధంగా యువతలో దాగి ఉన్న నైపుణ్యాన్ని వెలికి తీసేలా స్కిల్ డెవలప్‌మెంట్‌పై ఐదవ సంతకం చేసి ప్రజల హృదయాల్లో నిలిచి పో యారన్నారు. కోవూరు నియోజకవర్గ ప్రజల రుణం తీర్చుకోలేనిదని, వారికి ఆ జన్మాంతం రుణపడి ఉంటామన్నారు. యువతకు ఉపాధి కల్పించేలా ఈ ఐదేళ్ల పరిపాలనలో ప్రత్యేక దృష్టి సారిస్తామన్నారు. తమ గెలుపుకోసం టీడీపీ, బీజేపీ, జనసేన నా యకులు, కార్యకర్తలు చేసిన కృషి ఎనలేనిదన్నారు. ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన వెంటనే ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాలను నెరవేర్చిన ఘనత చంద్రబాబు నాయుడుకే దక్కిందన్నారు. ఈ సందర్భంగా ఆ ప్రాంతంలో ఉన్న నాయకులకు, కార్యకర్తలకు, మీడియా ప్రతినిధులకు స్వయంగా ఆమె స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా టీడీపీ ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లురెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు మల్లారెడ్డి, లేగుంటపాడు సర్పంచ్ రాజగోపాల్‌రెడ్డి, పార్టీ సీనియర్ నాయకులు కోడూరు కమలాకర్‌రెడ్డి, మాజీ బొందిలి కార్పొరేషన్ చైర్మన్ కిషోర్ సింగ్, దండి సతీష్, ఎన్డీఏ నేతలు రాఘవేంద్రరావు, సుబ్బారావు, మల్లికార్జున్‌రెడ్డి, విజయ్‌బాబు, సీహెచ్ శ్రీనివాసులురెడ్డి, హరిరెడ్డి, ఎంపీటీసీ సభ్యులు నాగరాజు, సునీల్, కోవూరు సర్పంచ్ విజయలక్ష్మి, కోదండరామ స్వామి దేవస్థానం చైర్మన్ కాటంరెడ్డి కృష్ణారెడ్డి, బాల రవి, సీహెచ్ పెంచలయ్య, వెంకటేశ్వర్లు, సాధిక్, నాగేశ్వరరావు, పెద్ద సంఖ్యలో నేతలు, కార్యకర్తలు ఉన్నారు.

# 5 సంతకాలతో పాలన ప్రారంభం




**నెల్లూరు, జూన్ 14, ప్రభాతవార్త – వైద్యం** తెలుగు దేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఎన్నికల వాగ్ధానాలలో ఇచ్చిన హామీల ప్రకారం ఐదు సంతకాలతో పరిపాలన ప్రారంభించడం జరిగిందని తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షుడు షేక్ అబ్దుల్లాజీజ్ పేర్కొన్నారు. శుక్ర వారం నగరంలోని జిల్లా తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో నెల్లూరు పార్లమెంట్ టిడిపి అధ్యక్షు లు అబ్దుల్ అజీజ్ విలేకరుల సమావేశం నిర్వ హించారు. ఈ సందర్భంగా అబ్దుల్ అజీజ్ మాట్లా డుతూ నెల్లూరు జిల్లాలో పదికి పది సీట్లు గెలి పించిన జిల్లా ప్రజలందరికీ మనస్ఫూర్తిగా కృతజ్ఞ తలు తెలియజేస్తున్నానన్నారు. నారా చంద్రబాబు నాయుడు పదవి స్వీకరించిన తరువాత పేదవారు, వ్యాపారస్తులు, రైతులు, కార్మికులు ఇలా అన్ని వర్గాల వారిలో పండుగ వాతావరణం కనిపించింది. చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి పదవి తీసు కుంటే ఆంధ్ర రాష్ట్రానికి స్వరాజ్య వచ్చిన విధంగా ప్రజలు ఆనందోత్సహాలతో ఉన్నారు. ఇచ్చిన ఎన్నికల హామీల్లో భాగంగా చంద్రబాబు నాయుడు ఐదు సంతకాలు చేసి పరిపాలన ప్రారంభించారని షేక్ అబ్దుల్ అజీజ్ వెల్లడించారు. మెగా డీఎస్సీ పేరుతో 16348 ఉద్యోగాల కల్పనకు శ్రీకారం చుట్టారు. జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వంలో డిఎస్సి ఉసెత్తిన పాపాన పోలేదు. ఎన్నికల ముందు కేవలం ఎనిమిది వేల ఉద్యోగాలకు నోటిఫికేషన్ ఇచ్చి ప్రజలను మభ్య పెట్టే ప్రయత్నం చేశారు. 2014 – 19 మధ్యకాలంలో డిఎస్సి పేరిట దఫాల వారీగా 16 వేల ఉద్యోగాలకు నోటిఫికేషన్ ఇచ్చామని అజీజ్ తెలిపారు. ప్రజల ఆస్తిని కబ్జా చేసుకునే విధంగా ఆస్తులకు రక్షణ లేని ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్‌ను జగన్ మోహన్ రెడ్డి తీసుకొచ్చారని వెల్లడించారు. అలాంటి దారుణమైన చట్టాన్ని రద్దు చేస్తూ చంద్రబాబు రెండవ సంతకం చేశారు. జగన్మోహన్ రెడ్డి చాదస్తంతో ప్రభుత్వ లోగో ఉండాల్సిన ప్రజల ఆస్తి కాగితాలపై తన బొమ్మ వేసుకున్నాడని ఆయన ఆరోపించారు. 200 ఉన్న పింఛను ఐదు రెట్లు పెంచి వెయ్యి రూపాయిలు చేసి తిరిగి వెయ్యి రూపాయిలు ఉన్న పెన్షన్ 2 వేలు చేసిన ఘనత చంద్రబాబు దేనన్నారు. 2000 రూపాయిలు ఫించను 3000 చేస్తానని చెప్పిన జగన్మోహన్ రెడ్డి దఫాల వారీగా పెంచుకుంటూ వెళ్లి ప్రజలను మోసం చేశారు. ఇచ్చిన హామీ ప్రకారం అధికారం చేపట్టగానే పెన్షన్ పెంపు పై చంద్రబాబు సంతకం చేశారు. గతానికి భిన్నంగా అత్యధికంగా పింఛన్లను పెంచాడని వివరించారు. జగన్మోహన్ రెడ్డి అధికారం చేపట్టాక దుర్మార్గంగా పేదలకు అన్నం పెట్టే అన్న క్యాంటీన్ రద్దు చేశారు. పేదలకు, రైతు కూలీలకు, కూలీలకు అన్నం పెట్టే అన్న క్యాంటీన్ పునరుద్ధరణకు చంద్రబాబు సంతకం చేశారు. ఇలాంటి పనులు చేయాలంటే ప్రజలను ఓటర్లుగా భావించే చంద్రబాబు లాంటి వారు మాత్రమే చేయగలరు. ప్రభుత్వాలే అన్ని ఉద్యోగాలు కల్పించ లేవు. ప్రైవేట్ సంస్థలు కూడా ఏర్పాటు చేసి ఉద్యో గాలు కల్పించాలి, పరిశ్రమలతోనే అది సాధ్యమవు తుందన్నారు. అన్ని రకాల పరిశ్రమలు ఆంధ్ర రాష్ట్రా నికి రావటానికి వనరులు సిద్ధంగా ఉన్నాయని తెలి పారు. పరిశ్రమలకు ఉపయోగపడే 1.25 కోట్ల మం ది యువత ఆంధ్ర రాష్ట్రంలో ఉన్నారు. చదువుతో పాటు వృత్తి నైపుణ్యం కూడా అవసరం ఎవరికి ఎందులో నైపుణ్యం కావాలో తెలుసుకోవటమే నైపుణ్య గణనన్నారు. పరిశ్రమలు రాకముందే ఏ పరిశ్రమ వచ్చినా మన యువత సిద్ధంగా ఉండేందుకు వృత్తి నైపుణ్యంలో సిద్ధహస్తులను చేసి ఉద్యోగాలు కల్పిస్తామన్నారు. జగన్మోహన్ రెడ్డి వల్ల రైతులకు గిట్టుబాటు ధరలు రాలేదు పక్క దేశాల్లో జరిగే యుద్ధాల వల్ల డిమాండ్ పెరగటం వల్ల రైతులకు గిట్టుబాటు ధర లభించింది. ప్రజలకు మంచి జరిగే నూతన ఇసుక పాలసీని చంద్రబాబు తీసుకొని వస్తారు. రాజధాని లేని రాష్ట్రంగా ఆంధ్ర రాష్ట్రాన్ని అందరూ ఎగతాళి చేసేవారన్నారు. టిడిపి అధికారంలోకి వచ్చాక అందరి నోర్లు మూసుకుపో యాయని చెప్పారు. కేంద్రంలో టిడిపి కింగ్ మేకర్‌గా మారింది. బిజేపి సహకారంతో రాష్ట్రాన్ని మోడల్‌గా తయారు చేస్తామని అన్నారు. రాష్ట్రాన్ని కాపాడింది ప్రజలేనని గతంలో ఆలోచించకుండా వేసిన ఓట్లు రాష్ట్రాన్ని నాశనం చేస్తే నేడు వేసిన ఓట్లు రాష్ట్రాన్ని గాడిలో పెట్టాయన్నారు. టిడిపి నా యకులు, కార్యకర్తలు చట్టాన్ని చేతిలోకి తీసు కోవద్దు. మనల్ని ఇబ్బంది పెట్టిన వారెవరిని వదిలేదే లేదు. అందరినీ చట్టపరంగా శిక్షిద్దాం, టిడిపి నాయ కులు, కార్యకర్తలు ఎదుర్కొన్న సమస్యలు జిల్లా పార్టీ కార్యాలయానికి తెలియచేస్తే ఇబ్బంది పెట్టిన వారిని చట్ట రిత్యా శిక్షిస్తామని ఆయన తెలిపారు.

# ఫోర్జరీ ఘటనలో నిందితులపై చర్యలు తీసుకోవాలి

**నెల్లూరు, జూన్14 ప్రభాతవార్త–విద్య** నెల్లూరు కార్పోరేషన్‌లో కమిషనర్ సంతకాని ఫోర్జరీ చేసిన నిందితులను గుర్తించి తక్షణం చర్యలు తీసుకోవాలని సిపిఐ నగర కార్యదర్శి అరిగెల నాగేంద్రసాయి డిమాండ్ చేశారు. శుక్రవారం నగరంలోని స్థానిక సంతపేటలోని సిపిఐ పార్టీ జిల్లా ప్రధాన కార్యాల యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు గత కొద్ది రోజులుగా అన్ని దినపత్రికల్లో కమిషనర్ సంతకాన్ని ఫోర్జరీ చేశారని కోట్ల రూపాలయ అవితీని జరిగిందని కథనాలు వచ్చాయన్నారు. ఒక ఐఏఎస్ సంతకాన్ని ఫోర్జరీ చేయటం అంటే దానిని తీవ్రమైన శిక్షగా పరిగనించాలని, అలాగే ఈ సంఘటనల వెనుక మేయర్‌భర్త కూడా ఉన్నారని అరోపణలను వస్తున్నాయన్నారు. అలాగే ఓ ప్రజా ప్రతినిధి కూడా ఇందులో ఉన్నారని తెలుపటం విచారకరమన్నారు. ఇంత జరిగిగా సంబందిత అధికారులు ఎటువంటి సమావేశాలు నిర్వహించక పోవటం దారుణమని, వెంటనే దీనిపై నిజా నిజాలు ప్రజలకు తెలపాలన్నారు. ఇటువంటి అవినీతికి పాల్పడిన వారిని అందరిని గుర్తించి చర్యలు కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకలు ముక్తియార్, నాగేంద్ర, లీలామెహన్ తదితరులు పాల్గొన్నారు.




# అమృత పథకం పైలాన్‌ని ధ్వంసం చేసిన వారిని వెంటనే అరెస్ట్ చేయాలి !



### ఆనాటి పాలకులు, అధికారుల్ని కూడా కఠినంగా శిక్షించాలి !!
### బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గుండ్లపల్లి భరత్‌కుమార్ యాదవ్ డిమాండ్

**కావలి, జూన్ 14 ప్రభాతవార్త** కేంద్ర ప్రభుత్వ నిధులతో నిర్మించిన అమృత పథకం పైలాన్‌ను ధ్వంసం చేసిన పాలకులు, అధికారులను, షాడో లను వెంటనే గుర్తించి అరెస్ట్ చేసి కఠినంగా శిక్షిం చాలని బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, మాజీ జిల్లా అధ్యక్షుడు గుండ్లపల్లి భరత్‌కుమార్ యాదవ్ డిమాండ్ చేశారు. కావలి పట్టణ రైల్వే రోడ్డులోని జర్నలిస్ట్ క్లబ్‌లో శుక్రవారం బిజెపి నేతలు మీడియా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో గుండ్లపల్లి మాట్లాడారు. కేంద్ర మంత్రి వెంకయ్య నాయుడు కావలి మున్సిపల్ ప్రజల శాశ్విత దాహా ర్తిని దృష్టిలో పెట్టుకొని అమృత పథకాన్ని మం జూరు చేశారన్నారు. ఈ పథకం కావలి మున్సి పాల్టీకి వర్తించకపోయినా ఆయన మంచి మనసుతో మంజూరు చేశారన్నారు. ఈ అమృత పథకంకు గుర్తుగా కావలి పట్టణ నడిబొడ్డున తహశీల్దార్, రూరల్ పోలీస్ స్టేషన్, ఆర్డీవో కార్యాలయాలకు సమీపంలో ఎయం బేకరీకి ఎదురుగా పైలాన్‌ను ఎంతో అందంగా నిర్మించడం జరిగిందన్నారు. ఆనాటి మంత్రి నారా లోకేష్ శంఖుస్థాపన చేయడం జరిగిందన్నారు. కావలి ప్రజలను ఆకర్షించే విధంగా పైలాన్‌ను ఏర్పాటు చేశారన్నారు. 2020 సంవత్సరం ఏప్రిల్ 10వ తేది అర్ధరాత్రి ఆనాటి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి, వైసిపి నేతలు, కొంతమంది వ్యక్తులు కలిసి ఆ రోజు ఇక్కడ పనిచేసిన కావలి డిఎస్పీ ప్రసాద్ సమక్షంలో అమృత పథకం పైలాన్‌ని ధ్వంసం చేశారన్నారు. సిసి కెమెరాల కనెక్షన్లను తీసివేశారన్నారు. ఒక పథకం ప్రకారం కుట్రతో, అక్కసుతో పైలాన్‌ను కూల్చివేశారన్నారు. ఈ సంఘటనలో బాధ్యులైన మున్సిపల్ కమిషనర్, కావలి డిఎస్పీ, తహశీల్దార్, ఆర్డీవో, సంబంధిత పోలీస్ అధికారులు, ఆనాటి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి, వైసిపి నేతలు, మరికొంతమందిని అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కూల్చివేసిన పక్క రోజు పైలాన్‌కు సంబంధించిన ఏమి లేకుండా శుభ్రం చేశారన్నారు. 11వ తేది ఒక భవన నిర్మాణానికి శంఖుస్థాపన చేశారన్నారు. ఆ ప్రాంతంలో భారీ స్వాగత ఫ్లెక్స్‌ను కూడా ఏర్పాటు చేశారన్నారు. ఈ శంఖుస్థాపనలో ఆనాటి పాలకులు, తదితరులు పాల్గొన్నారన్నారు. అమృత పథకం పైలాన్ కూల్చివేతపై టు టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడం జరిగిందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించిన ఈ కూల్చివేత సంఘటనలో విధ్వంసకుల్ని తప్పించేందుకు పోలీస్ అధికారులు పథకం ప్రకారం ఎవరి ఆచూకి లేదని ఫైల్‌ని మూసివేయడం ఎంతో దారుణమన్నారు. 2023 సెప్టెంబరు 19వ తేది ఈ ఫైల్ మూసిఎ సినట్లు తెలుస్తుందన్నారు. పైలాన్ కూల్చిన చోటే తిరిగి నిర్మించాలని డిమాండ్ చేశారు.

**ఒక నెల రోజులు సమయం ఇస్తున్నాం...** అమృత పథకం పైలాన్‌ని కూల్చివేసిన అధికారులు, పాలకులు అందరిపై క్రిమినల్ కేసులు నమోదు చేసి జైలుకు పంపాలని గుండ్లపల్లి భరత్‌కుమార్ యాదవ్ తెలిపారు. నెల రోజులు సమయం ఇస్తున్నామని హెచ్చరించారు. స్పందించకపోతే బిజెపి, టిడిపి, జ నసేన కూటమి ఆధ్వర్యంలో కోర్టును ఆశ్రయించడం జరుగుతుందన్నారు. ఈ కేసును సిఐడికి అప్పజెప్పాలని తెలిపారు. బిజెపి రాష్ట్ర అధ్యక్షురాలు పురంధేశ్వరి, రాష్ట్ర మంత్రి సత్యకుమార్, కేంద్ర మంత్రుల దృష్టికి తీసుకెళ్తామన్నారు. అంతేకాకుండా అన్నక్యాంటిన్‌ను ప్రైవేట్ వ్యక్తులకు దారాదత్తం చేశారన్నారు. ఏ అధికారంతో ఆనాటి ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డి అన్నక్యాంటిన్‌ను ఎలా దారాదత్తం చేస్తారని ప్రశ్నించారు. అక్కడ ప్రెస్‌క్లబ్ ఏర్పాటు చేసి దాదాపు రెండు లక్షల రూపాయల లోపు కరెంటు బిల్లు బకాయి పెట్టారన్నారు. ఈ సొమ్మును మున్సిపల్ అధికారులు చెల్లించారా, ఎలక్ట్రిసిటీ అధి కారులు చెల్లించారా చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రజల సొమ్ము దుర్వినియోగం చేసిన వారిపై చర్య లు చేపట్టాలని కోరారు. వీటి మీద ఎన్డీఏ కూటమి ఆధ్వర్యంలో ధర్నా చేపట్టడం కూడా జరుగుతుం దన్నారు. ఎన్డీఏ కూటమి అభ్యర్ధిగా కావ్య కృష్ణారెడ్డి ఎమ్మెల్యేగా గెలిపించిన కావలి నియోజకవర్గ ప్రజలకు, బిజెపి, టిడిపి, జనసేన నాయకులకు, కార్యకర్తలకు ధన్యవాదాలు తెలిపారు. ఈ సమా వేశంలో బిజెపి పట్టణ అధ్యక్షులు కుట్టుబోయిన బ్రహ్మానందం, రూరల్ మండల అధ్యక్షుడు మామిడి వెంకటేశ్వర్లు, పట్టణ ప్రధాన కార్యదర్శి మందా కిరణ్‌కుమార్, ఎస్సీ మోర్చ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పరుసు వెంకటేశ్వర్లు, బిజెపి నేతలు వెంకటరెడ్డి, మస్తాన్, రాకేష్, జయకుమార్, పాల్గొన్నారు.

## ఇచ్చిన హామిలు వెంటనే అమలు చేసిన



**బుచ్చి జూన్ 14 ప్రభాతవార్త :** ఇచ్చిన హామిలు సిఎంగా ప్రమాణస్వీకారం చేసిన వెంటనే 5 హామిల మీద సంతకాలు చేసిన ఆదర్శ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అని టిడిపి మండల పార్టీ అద్యక్ష లు ఎం.వి శేషయ్య ప్రశంసించారు. బుచ్చిరెడ్డిపాళెం పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి ఆదేశాల మేరకు కేకున్ కట్ చేశారు .అనంతరం ఆయన మాట్లాడుతు ఎన్నికల సమయంలో మెగా డిఎస్‌సి పైన తొలి సంతకం చేస్తానని చెప్పి దానిని నిలబెట్టుకున్నాడు. ప్రజలు హడలిపోతున్న ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు చేస్తు మలి సంతకం, 4 వేలు పెన్షన్లు పెంపు మూడో సంతకం, అన్నా క్యాంటిన్లు పునరుద్దరణ నాలుగోవ సంతకం, స్కిల్ డివలప్‌మెంట్ 5వ సంతకం చేసి మాట నిలుపుకున్న ఆదర్శముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అని ఆయన ప్రశంసించారు. యువత, రైతులు, అన్ని వర్గాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారని ఆయన తెలిపారు. అనంతరం జూగుంట పురుషోత్తమ్ మాట్లాడుతు విజన్ కలగనాయకుడు చంద్రబాబు నాయుడు అని ప్రశంసించారు. ఇచ్చిన 5 హామిలపైన సంతకాలు చేసి ప్రజల మనన్నలు పొందిన నాయకుడు చంద్రబాబునాయుడు అని ఆయన ప్రశంసించారు. ఎంపిగా వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యేగా వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, నేతృత్వంలో టిడిపి ప్రభుత్వం హాయంలో కోవూరు నియోజకర్గం అనూహ్యారీతిలో అభివృద్ధి చెందుతుందని అన్నారు. ఈ సందర్బంగా కేకున్ కట్ చేసి అందరు సంబరాలు జరుపుకున్నారు. ఈకార్యక్రమంలో మండల టిడిపి నాయకులు బత్తల హరికృష్ణా, కావలి వెంకటేశ్వర్లు, గుత్తా శ్రీనివాసులు, దుగ్గిశెట్టి హరినాద్, తాళ్ళ నరసింహస్వామి, వల్లూరు శ్రీనివాసులు, వింజం మహేష్‌నాయుడు, దళితనాయకులు ఉసురుపాటి ప్రసాద్, కిషోర్, చిలకా బాలకుమార్, బచ్చు సుబ్బారావు తదితరులు పాల్గోన్నారు.

## కాకర్ల విజయం ఉదయగిరి అభివృద్ధికి శ్రీకారం



**సీతారామపురం జూన్ 14 ప్రభాతవార్త :** ఉదయగిరి ఎమ్మెల్యేగా పోటీచేసి తొలిప్రయత్నంలోనే విజయం సాధించి న కాకర్ల సురేష్‌పట్ల ఉదయగిరి నియోజకర్గం ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారని సీతారామపురం 7 వవార్డు మెంబర్ తోట మనోజ్‌కుమార్ అన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతు ఉ దయగిరి గడ్డ కాకర్ల అడ్డా అని ఉదయగిరి నియోజకర్గం ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారని ఆయన తెలిపారు. చంద్రబాబునాయుడు నాయకత్వంలో ఉదయగిరి నియోజకవ ర్గానికి భారీ స్ధాయిలో పెట్టుబడులు తీసుకొని వచ్చి ఉదయగిరి నియోజకర్గంలో ఎన్నడు లేని విధంగా అన్ని విధాలా అభివృద్ధి చెందుతుందని అన్నారు. ప్రజలు అభివృద్ధికి పట్టం కట్టాలని ఉద్దేశంతో తెలుగుదేశం ప్రభుత్వాన్ని గెలిపించారని ఆయన తెలిపారు. అదే విధంగా ఇచ్చిన మాట నిలబెట్టుకుంటారని మెట్టు ప్రాంతమైన ఉదయగిరి నియోజ కవర్గంలోని సీతారామపురం మండలాన్ని అన్ని విధలుగా అభివృద్ధి చేందేలా కృషి చేస్తామని అన్నారు.

## చంద్రబాబు మాట చెప్పాడంటే చేస్తాడంతే



**కావలి, జూన్ 14 ప్రభాతవార్త :** ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు మాట చెప్పాడంటే వెంటనే చేస్తాడని కావలి తెలుగుదేశం పార్టీ నాయకులు తెలిపారు. పాలనా పగ్గాలు చేపట్టిన మొదటి రోజే ఐదు హామీలపై సంతకాలు చేయడంతో కావలి ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి ఆదేశాల మేరకు శుక్రవారం కావలి పట్టణంలోని ఉదయగిరి బ్రిడ్జి సెంటర్‌లో చంద్రబాబునాయుడు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. టిడిపి పట్టణ అధ్యక్షులు గుత్తికొండ కిషోర్ ఆధ్వర్యంలో సీట్లు పంపిణీ చేసి సంబరాలు చేశారు. అనంతరం పాలాభిషేకానికి వచ్చిన లబ్ధిదారులు, యువత మాట్లాడారు. నిరుద్యోగుల ఐదేళ్ళ కష్టాలు తీరేలా ఏకంగా 16, 347 ఉపాధ్యాయ పోస్టుల భర్తీ ఫైల్‌పై ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తొలి సంతకం చేసి మెగా డిఎస్సీపై యువతకు ఇచ్చిన మాట నిలబెట్టుకున్నారన్నారు. ప్రజల ఆస్తులను భక్షించే ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దుపై రెండో సంతకం చేసి ప్రజల ఆస్తులను కాపాడారన్నారు. అవ్వాతాతల పింఛను ఒకేసారి 4 వేలకు పెంచే దస్త్రంపై మూడో సంతకం చేసి ఆ ఇంటి పెద్ద బిడ్డగా నిలిచారన్నారు. పట్టణాలకు వచ్చే కూలీలు, ఇతర పనులు మీద వచ్చే వారి ఆకలి బాధలు తీర్చేందుకు అన్న క్యాంటీన్లు పునరుద్దరణపై నాలుగో సంతకం చేశారన్నారు. యువతకు ఉపాధి అవకాశాలకు అవసరమైన స్కిల్ సెన్సెస్‌పై ఐదో సంతకం చేశారన్నారు. అనంతరం తెలుగుదేశం నాయకులు మాట్లాడుతూ రానున్న రోజులలో రాష్ట్రం మరింతగా అభివృద్ధి చెందుతుందన్నారు. ఇచ్చిన ప్రతి హామీ నెరవేరనుందని తెలిపారు. అభివృద్ధి, సంక్షేమం పరుగులు పెడుతుందన్నారు. పెద్దఎత్తున టిడిపి, బిజెపి, జనసేన నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

## పకడ్బందీగా మౌలిక వసతులు కల్పించండి



**నెల్లూరు జూన్ 14, ప్రభాతవార్త, వైద్యం :** ముస్లింలకు పరమ పవిత్రమైన బక్రీద్ సందర్భంగా నియోజకవర్గ వ్యాప్తంగా అన్ని మండలాల్లో వసతులను పకడ్బందీగా మౌలిక వసతులు కల్పించాలని కోవూరు నియోజకవర్గ ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి ఆదేశించారు. శుక్రవారం నగరంలోని మాగుంట లేఅవుట్‌లో ఉన్న తన కార్యాలయంలో నియోజకవర్గ మండలాల ఎంపిడిఓలు, ఇతర అధికారులు, ముస్లిం మైనారిటీ నాయకులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులతో ఆమె మాట్లాడుతూ తన గెలుపులో కోవూరు నియోజకవర్గ ముస్లిం సోదర, సోదరీమణులు పాత్ర చాలా విలువైందని తనకు అండగా నిలిచి ఒక ఆడపడుచుగా గెలిపించిన ప్రతి ఒక్కరికి దన్యవాదాలు తెలిపారు. సోమవారం బక్రీద్ సందర్భంగా కోవూరు నియోజకవర్గ వ్యాప్తంగా ముస్లింలు ప్రార్ధనలు చేస్తారని వారి కోసం ప్రత్యేక సౌకర్యాలు కల్పించాలన్నారు. ఎక్కడా ముస్లిం సోదరులకు అసౌకర్యాలు కలగకూడదని, ముస్లింలు ప్రార్ధనలు చేసుకునేందుకు అన్ని సౌకర్యాలు కల్పించాలన్నారు. ప్రార్ధనా స్థలాల్లో పారిశుద్ద్యం మెరుగ్గా ఉండాలని, అన్ని చోట్ల డస్ట్‌బిన్‌లు ఏర్పాటు చేయాలన్నారు. ఈద్గాల వద్ద తప్పకుండా ప్రత్యేక షామియానాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. ప్రార్ధనలు చేసుకునేందుకు ఎక్కడైనా సమస్యలు ఉంటే తప్పకుండా తన దృష్టికి తీసుకురావాలని ఆమె కోరారు. శానిటేషన్‌పై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. విద్యుత్ శాఖ అధికారుల సమన్వయంతో కరెంట్ సరఫరాకు ఆటంకం లేకుండా చూడాలన్నారు. పెద్ద ఎత్తున ప్రార్ధనలు జరిగే ప్రాంతాల్లో పంచాయితీ ఆధ్వర్యంలో షామియానాలు ఏర్పాటు చేయాలన్నారు. నీటి వసతి లేని చోట తప్పకుండా ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేయాల్సి ఉందన్నారు. అలాగే ఎండ తీవ్రత దృష్ట్యా మంచి నీటి వసతి కల్పించాలన్నారు. వసతుల ఏర్పాటులో తప్పకుండా ఆయా స్ధానిక నాయకుల సహకారం తీసుకోవాలని, ఆదివారం మధ్యాహ్నానికి ఏర్పాట్లు పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ముస్లిం పెద్దల నుంచి వివిధ అంశాలపై సలహాలు, సూచనలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో వివిధ మండలాల ఎంపిడిఓలు, ఇతర అధికారులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## రూప్‌కి శుభాకాంక్షలు తెలిపిన వ్యాపారస్తులు

**నెల్లూరు జూన్ 14, ప్రభాతవార్త - వైద్యం :** నెల్లూరు నగరంలోని ఆత్మకూరు బస్టాండ్ సమీపంలో ఉన్న



జేమ్స్ గార్డెన్‌లోని నగర డిప్యూటీ మేయర్ పోలుబోయిన రూప్ కుమార్ యాదవ్ కార్యాలయంలో నెల్లూరు జిల్లా టిడిపి సీనియర్ నాయకుడు దార్ల వెంకటేశ్వర్లు ఆద్వర్యంలో శుక్రవారం సండేమార్కెట్‌లో వ్యాపారాలు చేసుకుంటున్న చిరువ్యాపారస్తులు రూప్ కుమార్ యాదవ్‌ని కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. మొన్న జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ విజయానికి తన వంతు కృషి చేసినరూప్ కుమార్‌ని సన్మానించడం జరిగిందని వారు తెలిపారు. ఈ సన్మానంలో పలువురు వ్యాపారస్తులు పాల్గొన్నారు.

## ప్రతాప్ సి.రెడ్డిని కలిసిన ఎంపి వేమిరెడ్డి



**నెల్లూరు, జూన్ 14, ప్రభాతవార్త - వైద్యం :** అపోలో హాస్పిటల్స్ ఫౌండర్, చైర్మన్ ప్రతాప్ సి రెడ్డిని నెల్లూరు ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. శుక్రవారం చెన్నైలోని అపోలో హాస్పిటల్‌కు చేరుకున్న ఎంపిని ప్రతాప్ సి రెడ్డి, హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ సునీత రెడ్డి ప్రత్యేకంగా సన్మానించారు. పుష్పగుచ్ఛం అందించి, శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా వివిధ అంశాలపై ఇరువురు చర్చించారు.

## ప్రశాంతిరెడ్డికి అభినందనల వెల్లువ



**కోవూరు, జూన్14ప్రభాతవార్త :** కోవూరు ఎమ్మెల్యేగా ఘన విజయం సాధించి తొలిసారి కోవూరుకు వచ్చిన వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డికి ఎన్డీఏ కూ టమి నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున స్వాగతం పలికారు. కోదండరామ స్వామి దేవస్థానం చైర్మన్ కా టంరెడ్డి కృష్ణారెడ్డి శాలువా, బొకేతో ఆమెను సత్కరించగా టీడీపీ నాయ కులు మల్లికార్జున్‌రెడ్డి, కొల్లారెడ్డి సుధాకర్‌రెడ్డి, ఎంపీటీసీ నాగరాజు, శాలువా, బొకేతో ఘనంగా సత్కరిం చారు. అదేవిధంగా కోవూరు సీడీపీవో జ్యోతి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు రాధిక, ప్రసూన, తదితరులు శాలు వా, బొకేతో అభినందించారు. అదేవిధంగా అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు వై.సుజాతమ్మ అంగన్‌వాడీ కార్యకర్తలతో వచ్చి శాలువా, పూలమొక్కతో ఘనంగా సత్కరించారు. తొలిసారిగా కోవూరుకు వచ్చిన ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డిని ఎంపీడీవో శ్రీరామాంజనేయులు పూలమొక్కతో సత్కరించారు. ఎన్డీఏ పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రతి యువకుడు విధిగా రక్తదానం చేయాలి




**కావలి, జూన్ 14 ప్రభాతవార్త :** మన దేశంలో 70 కోట్ల మంది యువకులు వున్నారని, వారు జీవి తంలో కనీసం ఒకసారి రక్తదానం చేసినా దేశంలో రక్తా నికి కొరత వుండదని కావలి ఆర్డీ వో శీనానాయక్ తెలిపారు. శుక్ర వారం కావలి రెడ్‌క్రాస్ రక్తకేం ద్రంలో ప్రపంచ రక్తదాన ఉత్స వాలను ఘనంగా ప్రారంభిం చారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో శీనానాయక్ మాట్లాడుతూ పెరుగుతున్న వివిధ ప్రమాదాలు, వైద్య అవసరాల కారణంగా రక్తం కొరత తీవ్రంగా వుందన్నారు. అందువల్ల ప్రతి యువకుడు విధిగా రక్తదానం చే యాలని కోరారు. తల్లిదండ్రులు కూడా తమ బిడ్డలను రక్తదానం చేసేలా ప్రోత్సహించాలని తెలిపారు. కావలి ఐయంఎ అధ్యక్షులు డాక్టర్ కె.సుబ్బారావు మాట్లాడుతూ రక్తంలో గ్రూపులను కనుగొన్న శాస్త్రవేత్త కార్ల్‌ల్యాండ్ స్టీనర్ జన్మదినాన్ని ప్రపంచ రక్తదాతల దినంగా పాటిస్తామని తెలిపారు. కావలి రెడ్‌క్రాస్ చైర్మన్ డి.రవిప్రకాష్ మాట్లాడుతూ కావలి రెడ్‌క్రాస్ రక్తకేంద్రం గత ఏడు సంవత్సరాల నుండి రాష్ట్రంలో రక్త సేకరణలో ప్రధమ స్థానంలో వుందన్నారు. అనంతరం కార్ల్ ల్యాండ్ స్టీనర్ చిత్రపటానికి పూలమాల వేసి కేక్ కట్ చేశారు. రక్తదాన శిబిరాన్ని ఆర్డీవో ప్రారంభించారు. వాయిస్ ఆఫ్ ముస్లిం మైనార్టీ అధ్యక్షులు మొగల్ సలీంబేగ్, మొగల్ రహీంబేగ్‌ల ఆధ్వర్యంలో పలువురు రక్తదానం చేశారు. టీం సేవియర్స్ అధ్యక్షులు ప్రణీత్, అద్వి ఫౌండేషన్ అధ్యక్షులు ప్రసన్నకుమార్, రెడ్‌క్రాస్ ప్రతినిధులు హరినా రపరెడ్డి, రఘుకుమార్, గంధం ప్రసన్నాంజనేయులు, దామిశెట్టి సుధీర్‌నాయుడు, లోకేశ్వరరెడ్డి, ఒరుగంటి వెంకటేశ్వర్లు, పూనూరు మురళీధర్‌రెడ్డి, ఐ.సాయిప్రసాద్, హనుమకుమార్, షమారహీం, జమున, రక్తకేం ద్రం సిబ్బంది పాల్గొన్నారు.

## రైతులకు పొద్దుతిరుగుడు విత్తనాల కిట్స్ పంపిణి



**సీతారామపురం జూన్ 14 ప్రభాతవార్త :** మండలానికి పొద్దుతిరుగుడు విత్తనాలు మిని కిట్స్ రూపంలో వంద శాతం సబ్సిడిపై రైతులకు పంపిణికి సిద్దంగా ఉన్నట్లు మండల వ్యవసాయాధికారి పి . చెన్నారెడ్డి తెలిపారు. నేషనల్ మిషన్ ఆన్ ఎడిబుల్ ఆయిల్ పధకంలో భాగంగా నూనె గింజలు ఉత్పాధకను పెంచుటకు అధిక దిగుబడిన ఇచ్చు ఎన్‌డిడిఎప్‌హెచ్ ,1012 రకం పొద్దు తిరుగుడు విత్తనాలు 2 కిలోల సంచుల రూపంలో మండలనాకి 5.3 క్వింటాలు 265 ప్యాకిట్ల రూపంలో పంపిణికి సిద్దంగా ఉన్నాయని తెలిపారు. పోద్దు తిరుగుడు పంట సాగుచేయు రైతులు ముఖ్య పంటగా లేదా పండ్ల తోటలలో అంతర పంటగా లేదా సజ్జ, కంది, వేరిశనగ మొదలగు పంటలలో పొలం చుట్టు గట్ల దగ్గర విత్తుకోవచ్చువని తెలిపారు. కావలసిన రైతులు ఆయారైతు భరోసా కేంద్రాలలో వ్యవసాయ సహాయకులను కలిసి విత్తనాలు పొందవచ్చునని తెలిపారు.

## నగరంలో పలుచోట్ల విద్యుత్ నిలుపుదల

**నెల్లూరు, జూన్ 14, ప్రభాతవార్త - వైద్యం :** నగరంలో పలు ఫీడర్ల పరిధిలోని మరమ్మత్తుల కోసం చెట్లు కొమ్మలు తొలగింపులకు శనివారం 33/11 రేబాల వీధి సబ్ స్టేషన్ నందు 33 కెవి ఏబి స్విచ్ మరమ్మతుల కారణంగా ఉస్మాన్ సాహెబ్ పేట, ఏసి నగర్, రాంనగర్, సిఆర్పి డొంక, ఎన్‌డిఆర్ లేఔట్, రేబాల వారి వీధి, ప్రకాష్ నగర్, స్టోన్ హౌస్ పేట మెయిన్ రోడ్డు, ఫుడ్ హౌస్ సంఘం తదితర ప్రాంతాలలో ఉదయం 9 గంటల నుండి ఉదయం 11.30 వరకు 33/11 రామూర్తి నగర్ సబ్ స్టేషన్ మరమ్మతుల కారణంగా రామ్మూర్తి నగర్, జేమ్స్ గార్డెన్, వెంకట రామాపురం, రామలింగపురం, బాలాజీ నగర్, ఆదిత్య నగర్, పుట్టప్ట్రీట్ తదితర ప్రాంతాలలో ఉదయం 8 నుండి ఉదయం 10 వరకు 33/11 బివి నగర్ సబ్ స్టేషన్ నందు 11 కెవి ఎన్‌జిఓ కాలనీ ఫీడర్ ఎన్జీవో కాలనీ, కృష్ణ మందిరం, సాయి బాబా మందిరం, ఉమారెడ్డి గుంటలోని కొన్ని ప్రాంతములు, మదర్ తెరిస్సా ఆశ్రమం ప్రక్కన తదితర ప్రాంతాలలో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12వరకు 33/11 గోమతి నగర్ సబ్ స్టేషన్ నందు 11 కెవి శ్రీహరి నగర్, ఫీడర్ నందు కొత్త ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు శ్రీహరి నగర్, బ్యాంక్ కాలనీ తదితర ప్రాంతాలలో ఉదయం 9.30 నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు 33/11 ఇరుకాలమ్మ సబ్ స్టేషన్ నందు 11 కెవి శాంతి నగర్, ఫీడర్‌లో శాంతి నగర్, బట్వాడి పాలెం సెంటర్, రామయ్య బడి సెంటర్, ఏసీబీ ఆఫీస్ తదితర ప్రాంతాలలో ఉదయం 9 నుండి మధ్యాహ్నం 1 గంట వరకు 33/11 కె. నగర్ సబ్ స్టేషన్ నందు 11 కెవి పోస్టల్ కాలనీ, ఫీడర్‌లో జడ్పి కాలనీ, గవర్నమెంట్ హాస్పిటల్, టీచింగ్, నాన్ టీచింగ్ స్టాప్ క్వార్టర్స్, 33/11 కెవి ఎంజి నగర్ సబ్ స్టేషన్‌లోని 11 కెవి ఎంఎస్ఆర్ ఫీడర్‌లోని బ్రహ్మానంద పురం, బెజవాడ ఓబుల్ రెడ్డి నగర్, డిఈఓ ఆఫీస్, బొల్లినేని హాస్పిటల్ తదితర ప్రాంతాలలో ఉదయం 8 నుండి మధ్యాహ్నం 1.30 వరకు 33/11 ఏకె నగర్ సబ్ స్టేషన్ నందు 11 కెవి సిఎం నగర్‌లో గాయత్రి నగర్, రిత్విక్ ఎనక్లేవ్, చంద్రమౌళి నగర్, సావిత్రి నగర్ తదితర ప్రాంతాలలో ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 12 వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు వినియోగదారులు ముందస్తు చర్యలు తీసుకోవాలని అత్యవసర విభాగం వారు తగిన ఏర్పాట్లు చేసుకోవాలని నెల్లూరు టౌన్ డివిజన్ ఆపరేషన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఏ. సోమశేఖర్ రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

## జిల్లాలో కేంద్ర బృందం పర్యటన

**నెల్లూరు అర్బన్, జూన్14, ప్రభాతవార్త** రాష్ట్ర ప్రభుత్వం రబీ వ్యవసాయ సీజన్‌కు సంబంధించి ఆరు జిల్లాలను కరువు జిల్లాలుగా ప్రకటించిన నేపథ్యంలో జిల్లాలో కరువు పరిస్థితిని అంచనా వేయడానికి ఈ నెల 19,20వ తేదీల్లో ఇంటర్ మినిస్టీరియల్ సెంట్రల్ టీం పర్యటించనున్నట్లు జిల్లా కలెక్టర్ ఎం.హరినారాయణన్ ఒక ప్రకటనలో తెలిపారు. కేంద్ర పశుసంవర్ధక, డైయిరీశాఖ డైరెక్టర్ సందీప్‌శర్మ ఆధ్వర్యంలోని కేంద్ర ప్రభుత్వ ఉన్నతాధికారులు మన్ను జి.ఉపాధ్యాయ్, మదన్‌మోహన్ మౌర్యలతో కూడిన కేంద్ర బృందం జిల్లాలో కరువు పరిస్థితిని అంచనా వేయనున్నట్లు కలెక్టర్ చెప్పారు. జిల్లా కేంద్ర బృందం పర్యటనకు అన్ని ముందస్తు ఏర్పాట్లు చేయాలని, కరువు నష్టాన్ని వివరించేలా ఫోటో ఎగ్జిబిషన్ ఏర్పాటు, పవర్‌పాయింట్ ప్రజంటేషన్ , కేంద్ర బృందం పరిశీలించే ప్రాంతాలకు సంబంధించి రూట్‌మ్యాప్‌లు సిద్ధం చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.

## వేపినాపి సెక్టార్ పరిధిలో అంగన్‌వాడీ బడి బాట



**వేపినాపి(రాపూరు), జూన్14ప్రభాతవార్త :** రాపూరు ఐసిడిఎస్ ప్రాజెక్ట్ పరిధిలోని వేపినాపి సెక్టార్‌లో వున్న అంగన్‌వాడీ కేంద్రాలలో శుక్రవారం సూపర్‌వైజర్ సౌజన్య ఆధ్వర్యంలో అంగన్‌వాడీ బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్బంగా 3 సంవత్సరాల వయస్సు వున్న ప్రతి చిన్నారిని అంగన్‌వాడీ కేంద్రానికి పంపాలని, గ్రామాలలో చిన్నారులతో కలసి ర్యాలీ నిర్వహించారు. వేపినాపి సెక్టార్ పరిధిలోని వేపినాపి, రామదేవిపల్లి, తాతిపల్లి, నాయనపల్లి, తూమాయి, శానాయపాళెం, పోకూరుపల్లి, గోగునరసాయపాళెం, గ్రామాలలో అంగన్‌వాడీ బడిబాట ర్యాలీలు నిర్వహించారు. ఆయా గ్రామాల అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు, చిన్నారులు పాల్గొన్నారు.

## 16న జెట్టిశేషారెడ్డి స్మారక సదస్సు



**నెల్లూరు, జూన్14 ప్రభాతవార్త-విద్య :** డాక్టర్ జెట్టిశేషారెడ్డి 16వ వర్ధంతి సందర్భంగా ఈనెల 16న నగరంలోని స్ధానిక జెట్టిశేషారెడ్డి విజ్ఞాన కేంద్రంలో జెట్టిశేషారెడ్డి సార్మక రాష్ట్రస్థాయి సదస్సును నిర్వహించనున్నామని శేషారెడ్డి మెమోరియల్ ట్రస్టు సభ్యులు నగేష్, మాదాల రాము,లు తెలిపారు. శుక్రవారం నగరంలోని స్ధానిక విజ్ఞాన కేంద్రంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు డాక్టర్ రామచంద్రారెడ్డి ప్రజావైద్యశాలలో ప్రధాన వైద్యులుగా అనేక సంవత్సరాలు పేద వారికి శెట్టి శేషారెడ్డి సేవలు అదించారన్నారు. అలాగే మూడ నమ్మకాలను రూపు మాపి ప్రజల్లో సైన్స్‌పై అవగాహన కల్పించే జనవిజ్ఞాన వేదిక ఏర్పాటులో కూడా శేషారెడ్డి కీలంగా వ్యవహరించారన్నారు. ఆయన సూర్పితో నేడు జిల్లాతోపాటూ రాష్ట్రవ్యాప్తంగా అనేక మంది వైద్యులు ప్రజా సేవ చేస్తున్నారని గుర్తుచేశారు. అంటరాని తనం రూపు మాపటం , అందరికి వైద్యం, సమాచ చైతన్యం ఇలా తన జీవితం మెత్తం ప్రజా సేవలోనే గడిపారన్నారు. ఆయన స్మారకంగా నిర్వహించనున్న సదస్సులో ముఖ్యవక్తలుగా రాష్ట్ర హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి డాక్టర్ టి.సుందర రామన్ పాల్గొననున్నారని, అందరూ పాల్గొని ఈ సదస్సును విజయవంతం చేయ్యాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో వి.నరసింహం, తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణను కలసిన ఐసిడిఎస్ సూపర్‌వైజర్లు



**రాపూరు, జూన్14ప్రభాతవార్త :** వెంకటగిరి ఎమ్మెల్యే కురు గొండ్ల రామకృష్ణను శుక్రవా రం రాపూరు ఐసిడిఎస్ ప్రా జెక్ట్ సూప ర్‌వైజర్లు మర్యాద పూర్వకంగా కలిసారు. ఈ సందర్బంగా వారు ఎమ్మెల్యే రామకృష్ణకు శాలువా కప్పి, పూలబోకేలు అందజేసి మూ డవసారి వెంకటగిరి ఎమ్మెల్యేగా గెలుపోంది నందుకు అభినంధనలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వారికి అంగన్‌వాడీ కేంద్రాలలో ప్రభుత్వం అందజేసే పౌష్టికాహా రాన్ని గర్బవతుల కు, బాలింతలకు, చిన్నారులకు సక్రమంగా ఆందజేయడంతో పాటు, అంగన్‌వాడీ కేంద్రాలు సక్రమంగా నడిచేలా సూచించారు. ఎమ్మెల్యేను కలసిన వారిలో సూపర్‌వైజర్లు యం.పద్మ, బి.రా ధిక, జె.రాజ్యలక్ష్మీ, డి.కొండమ్మ, ఎస్‌కె.ఫాతిమా, ఎ.ధనమ్మ తదితరులున్నారు.

## అక్రమంగా తరలిస్తున్న తెల్లరాయి టిప్పర్ పట్టివేత



**చేజర్ల జూన్ 14 ప్రభాతవార్త :** ప్రభుత్వం మారినా అక్రమార్కులు తీరు మారడంలేదు. దొరికిన కాడికి దోచేస్తున్నారు. మండలంలోని కోటి తీర్ధం నుండి అక్రమంగా తరలిస్తు న్న తెల్లరాయిని గ్రామస్తులు గమ నించి అధికారులకు సమాచారం ఇ వ్వడంతో రెవిన్యూ పోలీస్ అధికా రులు శుక్రవారం టిప్పర్ని స్వాధీనం చేసుకు న్నారు. ఈ సందర్బంగా కోటి తీర్ధం గ్రామంలో గతంలో కూడా తెల్లరాయి అక్రమ రవాణా య దచ్చేగా జరిగినట్లు గ్రామస్తులు ఆ రోపిస్తున్నారు. అదేవిధంగా రాత్రి సమయంలో పెన్నానది నుండి అక్ర మంగా ట్రాక్టర్లతో ఇసుక తరలిస్తు సొమ్ము చేసుకుంటున్నారని తెలియజేశారు. గ్రామ రెవిన్యూ అధికారి కనుస న్నలలో ఇదంతా జరుగుతుందని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. సంబందిత టిప్పర్‌ను మైనింగ్ అధికారులకు సమాచారం ఇచ్చి మైనింగ్ శాఖకు అప్పగించినట్లు రెవిన్యూ పోలీసు అధికారులు తెలిపారు. ఈవిషయంపై సమగ్రంగా తయారు చేసి బాధుతులైన వారిపైన కఠిన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

## కావలి ఆర్టీసీ బస్టాండ్‌లోని స్వీపర్ల సమస్యలు పరిష్కరించాలి



**కావలి, జూన్ 14 ప్రభాత వార్త :** కావలి ఆర్టీసీ బస్టాండ్‌లో స్వీపర్లుగా పనులు చేస్తున్న కార్మికుల సమస్యలను పరిష్కరిం చాలని సిఐటియు నాయ కులు డిమాండ్ చేశారు. సిఐటియు ఆధ్వర్యంలో శుక్రవారం సీనియర్ ట్రా ఫిక్ ఇన్స్‌పెక్టర్ యం.రామకృష్ణకి వినతి పత్రం అందజేశారు. అనంతరం సిఐటియు నాయకులు పసుపులేటి పెంచలయ్య మాట్లాడారు. బస్ స్టేషన్‌లో 15 సంవత్సరాలు పైబడి స్వీపర్లుగా పనులు చేస్తున్నారని వీరికి ఇచ్చే జీతాలు తక్కువ పనులు ఎక్కువ అని తెలిపారు. జీతాలు ప్రతి నెల 10వ తేది లోపల ఇవ్వాల్సి వుండగా అలా ఇవ్వడం లేదన్నారు. రెండు, మూడు నెలలకు ఒకసారి ఒక జీతం ఇస్తున్నారన్నారు. దీనివల్ల కార్మికులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. వీరికి పిఎఫ్, ఈఎస్ఐ కటింగ్ పోను 9 వేల 900 రూపాయలు నెలకు జీతం ఇవ్వాల్సి వుండగా ఆ కాంట్రాక్టర్ 9 వేల రూపాయలు ఇచ్చి చేతులు దులుపుకుంటున్నాడని తెలిపారు. అంతేకాకుండా వీరి పేరుతో జమ చేస్తున్న పిఎఫ్ రసీదులు సంవత్సరానికి ఒకసారి కార్మికులకు ఇవ్వాల్సి వున్నా ఇవ్వడంలేదన్నారు. ఈఎస్ఐ కార్డులు కూడా ఇంతవరకు ఇవ్వలేదన్నారు. అసలు పిఎఫ్, ఈఎస్ఐ కార్మికుల పేరుతో జమ అవుతున్నదో లేదో తెలియడం లేదన్నారు. ఇవ్వాల్సిన సెలవులు కూడా ఇవ్వడం లేదన్నారు. వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళన చేపట్టాల్సి వస్తుం దని హెచ్చరించారు. సిఐటియు నాయకులు జి.మధుసూదన్‌రావు, బి.కృష్ణయ్యతో స్వీపర్లు పాల్గొన్నారు.

## 20న ఐఐహెచ్‌టీలో స్పాట్ అడ్మిషన్లు

**నెల్లూరు అర్బన్, జూన్14, ప్రభాతవార్త** తిరుపతి జిల్లా వెంకటగిరిలో శ్రీ ప్రగడ కోటయ్య మెమోరియల్ ఇండియన్ ఇనిస్ట్యూట్ ఆఫ్ హ్యాండ్‌లూమ్ టెక్నాలజీ కళాశాలలో మూడేళ్ల డిప్లొమో కోర్సులో ప్రవేశాలలో ఈ నెల 20న స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నట్లు జిల్లా చేనేత, జౌళిశాఖ అధికార వరప్రసాద్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. హ్యాండ్‌లూమ్ అండ్ టెక్స్‌టైల్స్ టెక్నాలజీలో మూడేళ్లపాటు శిక్షణ ఇచ్చి కేంద్ర ప్రభుత్వ జౌళిశాఖ వారిచే సర్టిఫికెట్లు జారీ చేస్తామని ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. 10వ తరగతి పాసైన అభ్యర్థులు మార్కులు మెరిట్ ఆధారంగా ప్రవేశాలు కల్పిస్తామని, ఈ కోర్సు పూర్తి చేసిన విద్యార్థులకు చేనేత, జౌళిశాఖకు సంబంధించి ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల్లో ఉద్యోగ అవకాశాలు మెండుగా లభిస్తాయన్నారు. ఈ కోర్సు చేసిన విద్యార్థులు ఉన్నత విద్య అభ్యసించాలంటే బిటెక్ రెండో సంవత్సరంలో నేరుగా చేరే అవకాశం ఉందన్నారు. ఈ కోర్సులో చేరిన విద్యార్థులకు స్టైఫండ్ ఇవ్వనున్నట్లు చెప్పారు. పూర్తి వివరాలకు డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.ఐఐహెచ్‌టివిఆర్.కామ్‌ను సందర్శించగలరన్నారు. మరింత సమాచంర కోసం 9441795408, 9866169908, 9010243054 నెంబర్లకు సంప్రదించాలని కోరారు. ప్రవేశాల కోసం విద్యార్థులు అన్ని సర్టిఫికెట్లతో ఈ నెల 20న నేరుగా కళాశాలకు హాజరుకావాలని జిల్లా చేనేత, కళాశాలకు హాజరుకావాలని జిల్లా చేనేత, జౌళిశాఖ అధికారి వరప్రసాద్ సూచించారు.

## బిట్రగుంట రైల్వే అభివృద్ధి కోసం పార్టీలకతీతంగా కలిసిరండి



**బిట్రగుంట, జూన్ 14 ప్రభాతవార్త :** బిట్రగుంట రైల్వే అభివృద్ధి కోసం పార్టీలకతీతంగా స్థానికులు, ప్రజాసంఘాల నేతలు, ప్రజాప్రతినిధులు కలిసి ఒక వేదికపైకి రావాలని బిట్రగుంట రైల్వే అభివృద్ధి అధ్యక్షులు షేక్ నూరుద్దీన్ పిలుపునిచ్చారు. బిట్రగుంట రైల్వే స్టేషన్‌లో రిజర్వేషన్ కౌంటర్ ఎత్తివేతతో పాటు టికెట్ల విక్రయం ప్రైవేట్ వ్యక్తులకు కాంట్రాక్ట్ ఇవ్వడం విరమించుకోవాలని కోరుతూ రైల్వే స్టేషన్ సూపరింటెండెంట్ డి.ఎస్.మురళీధర్‌కు శుక్రవారం వినతి పత్రం సమర్పించారు. అనంతరం ప్రజాసంఘాలతో కలిసి ఆయన విలేకర్లతో మాట్లాడుతూ బిట్రగుంట రైల్వే స్టేషన్‌ని ప్రజాధనం కోట్లాది రూపాయలతో అభివృద్ధి చేసి స్టేషన్‌లో వున్న మౌలిక సదుపాయాల్ని తొలగిస్తూ వివిధ ఎక్స్‌ప్రెస్ రైళ్లు, మెమో రైళ్ళ స్టాపింగ్‌ను ఎత్తివేసి ప్రయాణికులను అసౌకర్యాలకు గురిచేస్తున్నారన్నారు. బిట్రగుంట రైల్వే స్టేషన్‌లో కరోనాకు ముందు ఎన్నో ఎక్స్‌ప్రెస్ రైళ్లు నిలుస్తుండేవని వీటి వల్ల బిట్రగుంట, దగదర్తి, అల్లూరు మండల ప్రజలకు ఎంతో సౌకర్యంగా వుండేవన్నారు. అటువంటి సౌకర్యాన్ని కరోనా అనంతరం రైళ్ల స్టాపింగ్‌లను ఎత్తివేయడం పట్ల ఇబ్బందులు పడుతున్నారన్నారు. అంతేకాకుండా ఈ మూడు మండలాలతో పాటు రైల్వే ఉద్యోగులు, విశ్రాంత రైల్వే ఉద్యోగులకు ఎంతో సౌకర్యంగా వున్న రిజర్వేషన్ కౌంటర్‌ని తీసివేశారన్నారు. ప్రస్తుతం టికెట్ల విక్రయం కూడా ప్రైవేట్ వ్యక్తులకు అప్పజెప్పారన్నారు. ఈ నిర్ణయాలను తాము మొదటి నుంచి వ్యతిరేకిస్తూ ఆందోళన కూడా జరిపామని అయినా ప్రజాప్రతినిధులు పార్టీలకతీతంగా చొరవ చూపకపోవడంతో తాము చేపట్టిన ఆందోళనను అధికారులు గుర్తించలేదన్నారు. ఇలాగే కొనసాగితే బిట్రగుంటకు పూర్వ వైభవం సంగతి దేవెడురక కానీ కనీస సౌకర్యాలు కనుమరుగవుతాయన్నారు. అందరు కలిసి వస్తే ఒక వేదికపై నుంచి ఆందోళన చేపడతామని తెలిపారు. ఈ సమావేశంలో మాట్లాడిన వారిలో టిడిపి సీనియర్ నేత చిలకపాటి వెంకటేశ్వర్లు, కాంగ్రెస్ పార్టీ నేత ఎస్.కె.జహీర్, వాకర్స్ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు శశికుమార్, మానవ హక్కుల సమితి జిల్లా అధ్యక్షులు దాసరి సునీల్, జైభీమ్ అంబేద్కర్ వ్యవస్థాపక అధ్యక్షులు బత్తుల రవిచంద్ర, అభివృద్ధి కమిటీ సభ్యులు ఆరోగ్యరాజ్, శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

## గిరిజన కాలనీలోని రామమందిరానికి దూపదీప నైవేద్యాలను సమకూరుస్తాం



**బిట్రగుంట, జూన్ 14 ప్రభాతవార్త :** బోగోలు మండలం కొండబిట్రగుంట గిరిజన కాలనీలోని శ్రీ రామమందిరంలో దూపదీప నైవేద్యాలకు సహకరిస్తామని కాంద్ర యువనేస్తం వ్యవస్థాపక అధ్యక్షులు కాంద్ర సతీష్‌నాయుడు హామీ ఇచ్చారు. కొండబిట్రగుంట గిరిజన కాలనీలోని రామమందిరాన్ని గిరిజనుల కోరిక మేరకు ఆయన శుక్రవారం సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో దూపదీప నైవేద్యాలకు దాత కరవయ్యారని ఆయన దృష్టికి తీసుకురాగా ఆ ఖర్చును తాను భరిస్తానని వారికి చెప్పారు. అనంతరం గంగతిప్పలోని గంగమ్మ గుడి, శివాలయంలో కూడా ఇటీవల జరిగిన ఎన్నికలలో టిడిపి విజయం సాధించడంతో ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయన వెంట మండల బిజెపి అధ్యక్షులు నూకసాని శ్రీనివాసయాదవ్, యువనేస్తం సభ్యులు పాల్గొన్నారు.

## స్వచ్ఛంద సేవా సంస్థల సహకారంతో 70 మంది రక్తదానం



**కావలి రూరల్, జూన్ 14 ప్రభాత వార్త :** ప్రపంచ రక్తదాన దినోత్సవం సందర్భంగా స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో కావలి ఏరియా వైద్యశాలలో శుక్రవారం మెగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిధిగా కావలి ఆర్డీవో శీనానాయక్ పాల్గొని రక్తదాతలను అభినందించారు. ముందుగా కావలి మున్సిపల్ కమిషనర్ జి.శ్రావణ్‌కుమార్, ఒకటవ పట్టణ సర్కిల్ ఇన్స్‌పెక్టర్ రాజేష్‌లు రక్తదానం చేసి రక్తదాతలకు మనోధైర్యాన్ని కలిగించారు. అగ్నిమాపక అధికారి రామసిద్దార్ద, 70 మంది రక్తదాతలు ఈ కార్యక్రమంలో పాల్గొని రక్తదానం చేశారు. రక్తదానం చేసిన మహిళలను ఆంధ్రప్రదేశ్ శ్వాక్స్ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ కామేశ్వరప్రసాద్ అభినందించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిధులు మాట్లాడుతూ జూన్ 14వ తేది ప్రపంచ రక్తదాన దినోత్సవం సందర్భంగా పలు స్వచ్ఛంద సేవా సంస్థల సభ్యులు సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం చాలా మంచి పరిణామమన్నారు. అత్యవసర సమయంలో రక్త నిల్వలు ఎంతో ఉపయోగపడతాయన్నారు. ప్రతి ఒక్కరు రక్తదానంపై అవగాహన కలిగి వుండాలన్నారు. తమ రక్తంతో ఆగిపోతున్న శ్వాసకు ఊపిరి పోయాలన్నారు. ఒకరు ఇచ్చిన రక్తంతో ముగ్గురు ప్రాణాలను కాపాడవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిధులకు స్వచ్ఛంద సంస్థల బాధ్యులు మొక్కలు అందజేసి దుశ్శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో విసేవ ఫౌండేషన్ ఫౌండర్ వినయ్‌కుమార్, రహీం ఛారిటబుల్ ట్రస్ట్ ఫౌండర్ మహ్మద్ అబ్దుల్ అలీం, ప్రియదర్శిని మహిళా మండలి అధ్యక్షురాలు షేక్ ఖాదర్‌బీ, గుడ్‌మెన్ ఛారిటబుల్ ట్రస్ట్ ఫౌండర్ సోమిశెట్టి బ్రహ్మయ్య, ట్రైంటూ హెల్ప్ ట్రస్ట్ ఫౌండర్ రమేష్, ప్రపంచ మానవ హక్కుల అవగాహన సంఘం దక్షిణాంధ్ర, మహిళా రీజియన్ చైర్‌పర్సన్ అనుమాలశెట్టి కామాక్షి, స్వచ్ఛంద సంస్థల గౌరవాధ్యక్షులు షేక్ ఖాదర్‌బాషాలు పాల్గొన్నారు.

## యం.వి.నారాయణ జ్ఞాపకార్థం యాచకులకు ఆహార ప్యాకెట్లు పంపిణీ



**కావలి రూరల్, జూన్ 14 ప్రభాతవార్త :** హైకోర్టు సీనియర్ న్యాయవాది దివంగత మువ్వల వెంకట నారాయణ జ్ఞాపకార్ధం శుక్రవారం అమ్మ ఆదరణ స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షులు నున్నా మురళి ఆధ్వర్యంలో కావలి పట్టణంలోని శివాలయం, అయ్యప్పస్వామి ఆలయం, బాబా మందిరం వద్ద వున్న యాచకులకు ఆహార పొట్లాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా న్యాయవాది, ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ కమిటీ సభ్యులు ఐ.సాయిప్రసాద్ మాట్లాడుతూ హైకోర్టు సీనియర్ న్యాయవాది దివంగత మువ్వల వెంకట నారాయణ ఆదర్శప్రాయుడని తెలిపారు. ఆయన పేరు మీద ప్రతి నెల 14వ తేది పేదలకు ఆహార పొట్లాలు పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. లోక్‌అదాలత్ సభ్యులు యం.మాలకొండారెడ్డి మాట్లాడుతూ ఆకలితో వున్న పేదవారికి ఆహారం అందజేయడం ఎంతో మంచి కార్యక్రమమని ఈ కార్యక్రమాన్ని వారి తనయుడు హైకోర్టు న్యాయవాది మువ్వల రవీంద్ర, మువ్వల వెంకట నారాయణ సతీమణి సత్యవతమ్మలు నిరంతరం కొనసాగించడం అందరికి స్ఫూర్తిదాయకమన్నారు. నున్నా మురళి మాట్లాడుతూ మా సంస్థ ఆధ్వర్యంలో మువ్వల వెంకట నారాయణ కుటుంబ సభ్యులు పేద వారిని ఆదుకోవడం ప్రశంసనీయమన్నారు. సంస్థ ఉపాధ్యక్షులు ఎస్.బాబురావు మాట్లాడుతూ తమ సంస్థ పేద వారి సంక్షేమానికి నిరంతరం కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో కుంతూరు శ్రీనివాసులు, ఆర్యవైశ్య యువసేవకుడు ఆదూరి మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

## విధి నిర్వహణలో అంకితభావం అవసరం



**కోవూరు, జూన్14ప్రభాతవార్త :** సామాజిక ఆరోగ్య కేంద్రంలో పనిచేసే వైద్యులు , ఆరోగ్య సిబ్బంది విధి నిర్వహణలో అంకితభావం తప్పనిసరి అని డాక్టర్ వెంకటాచలపతి గౌడ్ అన్నారు. కోవూరులోని సామాజిక ఆరోగ్య కేంద్రంలోని సమావేశ మందిరంలో శుక్రవారం వైద్యులు , ఆరోగ్య సిబ్బందితో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సామాజిక ఆరోగ్య కేంద్రంలో పనిచేసే ప్రతి ఒక్కరూ రోగులకు మెరుగైన సేవలు అందించేలా దృష్టి పెట్టాలన్నారు. అదేవిధంగా కేంద్రంలో పనిచేసే ప్రతి ఒక్కరూ యూనిఫామ్‌తో పాటు తప్పనిసరిగా వారి వారి ఐడీ కార్డులను ధరించాలన్నారు. ముఖ్యంగా ఎమర్జెన్సీ మందులను 24/7 ఎల్లవేళలా అందుబాటులో ఉంచుకోవాలని ఈ సందర్భంగా నర్సులకు సూచించారు. సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దేలా సమిష్టి కృషి అవసరమన్నారు. ఈ కార్యక్రమంలో సామాజిక ఆరోగ్య కేంద్రంలో పనిచేసే వైద్యులు, నర్సులు, ఆరోగ్య సిబ్బంది, పారిశుధ్య సిబ్బంది ఉన్నారు.

## వ్యాధి నిరోధక టీకాలను సద్వినియోగం చేసుకోవాలి



**కోవూరు, జూన్14ప్రభాతవార్త:** కోవూరు పశు సంవర్ధక శాఖ సబ్ డివిజన్ పరిధిలోని కోవూరు, విడవలూరు మండలాల్లో పశువులకు, గొర్రెలకు వ్యాధి నిరోధక టీకాలు వేస్తున్నారని దీనిని ఆయా ప్రాంతాల్లో ఉన్న పాడి రైతులు పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని పశు సంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ కృష్ణమౌర్య తెలిపారు. ముఖ్యంగా గొంతువాపు వ్యాధి నివారణ టీకాలను ఆవులకు, గెదె జాతి పశువులకు వేయడం జరుగుతుందన్నారు. అదేవిధంగా చిటుకవ్యాధి, గొంతువాపు వ్యాధి టీకాలను పశువులకు వేయడం జరుగుతుందని, దీంతో పాటు చిటుక వ్యాధి నివారణకు మేకలు, గొర్రెలల్లో వేయడం జరుగుతుందని దీనిని రైతులు పూర్తిస్థాయిలో ఉపయోగించుకోవాలన్నారు.

## కంటైనర్‌ను ఢీకొన్న మినీ వ్యాన్

### - డ్రైవర్ మృతి.. క్లీనర్‌కు తీవ్రగాయాలు





**కోవూరు, జూన్14ప్రభాతవార్త :** కోవూరులోని జాతీయ రహదారి ఆర్‌కే పెట్రోల్ బంక్ సమీపంలో శుక్రవారం తెల్లవారు జామున చిత్తూరు నుంచి హైదరాబాద్‌కు మామిడిపళ్ల లోడుతో వెళ్తున్న మినీ వ్యాన్ రహదారిలో ఆగి ఉన్న కంటైనర్‌ను వేగంగా ఢీకొంది. ఈ సంఘటనలో మినీ వ్యాన్ డ్రైవర్ సతీష్ తీవ్రగాయాలపాలై అక్కడికక్కడే మృతిచెందాడు. క్లీనర్‌కు తీవ్రగాయాలు కావడంతో 108 అంబులెన్స్‌లో నెల్లూరుకు తరలించారు. ఈ మేరకు సంఘటనా స్థలాన్ని కోవూరు ఎస్సై రంగనాథ్ గౌడ్ పరిశీలించి క్యాబిన్‌లో ఇరుక్కుపోయి ఉన్న సతీష్ మృతదేహాన్ని వెలికి తీసేందుకు గంట పాడు క్రేన్ సహాయంతో యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టారు. ఈ ప్రమాదం కారణంగా జాతీయ రహదారిలో మామిడికాయలు చెల్లాచెదరుగా పడిపోయాయి. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

## గ్రామ దేవతకు ప్రత్యేక పూజలు



**కోవూరు, జూన్14ప్రభాతవార్త :** కోవూరు మండలం గంగవరం గ్రామంలోని గ్రామ దేవత పక్కేళ్లమ్మ తల్లికి శుక్రవారం నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి అల్లుడు జి. నెనిన్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. నెల్లూరు రూరల్ ఎమ్మెల్యేగా మూడు సార్లు ఘన విజయం సాధించి హ్యాట్రిక్ ఎమ్మెల్యేగా పేరు పొందారని, దీనిని దృష్టిలో పెట్టుకుని ఈ ప్రాంతంలో ప్రత్యేక పూజలు చేపట్టడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు గూటూరు శ్రీధర్‌నాయుడు, పార్టీ నేతలు ఏ. శ్రీనివాసులు, పి. దయాకర్, మాజీ సర్పంచ్ రమణయ్య, తలారి బాబు, శివకుమార్, వెంకటేశ్వర్లు, తదితరులు ఉన్నారు.

## సంతకంతో సంబరాలు



**నెల్లూరు, జూన్ 14, ప్రభాతవార్త – వైద్యం :** నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటం రెడ్డి శ్రీధర్ రెడ్డి, నగర మాజీ మేయర్ నందిమండలం భానుశ్రీ, టిడిపి నాయకులు కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి సమక్షంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన వెంటనే మెగా డిఎస్సి పై తొలి సంతకం చేసి, అన్న క్యాంటీన్‌లను పునప్రారంభించేందుకు వృద్దుల పెన్షన్ 3000 నుండి 4000 వేలకు పెంచుతూ యువత ఉద్యోగ అవకాశాల కోసం స్కిల్ డెవలప్మెంట్ సెంటర్‌లో ఏర్పాటు కోసం ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌ను రద్దు చేస్తూ సంతకాలు చేసిన శుభ సందర్భంగా శుక్రవారం తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు సంబరాలు చేసి, స్వీట్‌లను పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ ఇన్చార్జిలు జలదంకి సుధాకర్, మన్నేపల్లి రఘు, 31వ డివిజన్ కార్పొరేటర్ బత్తల కృష్ణ, 19వ డివిజన్ టిడిపి నాయకులు నూకరాజు మదన్ కుమార్ రెడ్డి, కరణం హజరత్ నాయుడు, కూకటి హరిబాబు యాదవ్, నందిపాటి శ్యామ్, యానాదయ్య తదితరులు పాల్గొన్నారు.

## అంగన్‌వాడీ కి పోదాం రండి



**వరికుంటపాడు, జూన్ 14, ప్రభాతవార్త :** 3 సంవత్సరాల వయస్సు నిండిన చినారులను అక్కున చేర్చుకోని అంగన్‌వాడీ కి పోదాం రండి అంటూ మండలంలోని గువ్వాడి మెయిన్ అంగన్‌వాడీ కేంద్రం సిబ్బంది ప్రత్యేక ర్యాలీ ని నిర్వహించారు. అంగన్‌వాడీ కార్యకర్త మేడిశెట్టి విజయలక్ష్మి ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించి అంగన్‌వాడీ కేంద్రం ద్వారా చిన్నారులకు అందే ఫలాలపై అవగాహన కల్పించారు. ప్రతి చిన్నారి అంగన్‌వాడీ కేంద్రంను సద్వినీయోగం చేసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా నలుగురు చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రం నందు నమోదు చేసుకున్నారు. ప్రతి రోజు అంగన్‌వాడీ లో అందించే పౌష్టికాహారం, ఆలన పాలన ద్వారా చిన్నారులను బడి కి బాటలు వేసేందుకు ప్రభుత్వం ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారన్నారు. ఈ కార్యక్రమములో ఆయా నాగమ్మ, గ్రామస్తులు పాల్గొన్నారు.

## 34 వేల టీచర్ పోస్టులు భర్తీ చేయాలి



**ఉలవపాడు, జూన్ 14, ప్రభాతవార్త :** వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ప్రజల తిరస్కరణకు గురై తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. ప్రస్తుతం ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ప్రతిపక్షంలో ఉండగా మెగా డీఎస్సీ ప్రకటిస్తానని హామీ ఇచ్చారు. అధికారంలోకి రాగానే 16000 పోస్టులకు భర్తీ చేస్తామని తొలి సంతకం చేశారు. టీచర్ పోస్టులు భర్తీకి తొలి సంతకం చేయటాన్ని స్వాగతిస్తున్నాం. అయితే ప్రతిపక్షంలో ఉండగా 34 వేల పోస్టులు ఖాళీగా ఉన్నాయని తెలుగుదేశం, జనసేన నాయకులు ప్రకటించారు. అధికారంలోకి రాగానే 34 వేల పోస్టులకు బదులు 16 వేల పోస్టులకు మాత్రమే మెగా డీఎస్సీ పేరు తొలి సంతకం చేసి దగా చేశారని ఐఎఫ్‌టీయు నాయకులు కామ్రేడ్ ఆర్.మోహన్ ఆరోపించారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం గతంలో జీవో నెంబరు 117 తీసుకువచ్చి 9వేల పాఠశాలలను రద్దు చేసింది. అందు వలన అనేక టీచర్ పోస్టులు రద్దు అయ్యాయి. చంద్రబాబునాయుడు ప్రభుత్వం జీవో నెంబరు 117 రద్దు చేసి తొమ్మిది వేల పాఠశాలలను పునరుద్దరించాలని ఆ పాఠశాలలో టీచర్ పోస్టులు భర్తీ చేయాలని ఆర్.మోహన్ డిమాండ్ చేశారు.

## వసతి గృహాల్లో మలాథియాన్ స్ప్రే



**కోవూరు, జూన్14ప్రభాతవార్త :** కోవూరులోని సాంఘిక సంక్షేమ బీసీ బాలబాలికల వసతి గృహాల సముదాయాల్లో శుక్రవారం దోమల నియంత్రణకు ఫోకల్ స్ప్రేయింగ్‌లో భాగంగా మలాథియాన్‌ను పిచికారి చేసే కార్యక్రమాన్ని జిల్లా మలేరియా అధికారిణి ఈ. హుసేనమ్మ నిశితంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ విధమైన పిచికారి చేయడం వలన దోమల ఉధృతి పూర్తిగా తగ్గిపోతుందన్నారు. అదేవిధంగా వసతి గృహ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకునేలా సంక్షేమాధికారులు కూడా తగు చొరవ తీసుకోవాలన్నారు. అనంతరం మలేరియా వ్యతిరేక మాసోత్సవాల్లో భాగంగా ఆ ప్రాంతంలో ర్యాలీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సబ్ యూనిట్ అధికారి నాగరాజు, ఎంపీహెచ్ఎస్ ఇలియాజ్, సంక్షేమాధికారి వెంకట్రావు, ఆరోగ్య సిబ్బంది శ్రీనివాసరావు, శాంతి, ఆశా కార్యకర్తలు ఉన్నారు.

## గిరిజన దివ్యాంగుల బాలికల వసతి గృహంలో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోండి



**నెల్లూరు టౌన్ ,జూన్ 14, ప్రభాతవార్త :** ఈ విద్యా సంవత్సరం నెల్లూరు నగరం పొదలకూరు రోడ్డు, వాటర్ ట్యాంకు సమీపంలో ఉన్న దివ్యాంగుల గిరిజన బాలికల వసతి గృహంలో ప్రవేశానికి మూడో తరగతి నుండి ఆపై పోస్టు గ్రాడ్యుయేషన్ ఆపై చదివే దివ్యాంగుల బాలికలు దరఖాస్తు చేసుకోవాల్సిందిగా విభిన్న ప్రతిభావంతుల, వయో వృద్దుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు ఎస్.అక్బర్ అలీ శుక్రవారం నాడు ఒక ప్రకటనలో కోరారు. 2024–25 సంవత్సరంలో అడ్మిషన్లకు సంబంధించి 3వ తరగతి నుండి డిగ్రీ, పీజీ అపై వరకు చదువుకొనే బాలికలు దరఖాస్తుకు అర్హులు అని అన్నారు. శారీరక అంగవైకల్యం, పాక్షిక అంధత్వం, పాక్షిక వినికిడి లోపం కలిగి, ప్రభుత్వ వైద్యశాల నుండి ధృవీకరణ పత్రం పొందిన బాలికలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాల్సిందిగా కోరారు. పూర్తి వివరాల కొరకు వసతి గృహం సంరక్షణాధికారి 9912205985, 8309372102 మొబైల్ నెంబర్లకు సంప్రదించి తెలుసుకోవచ్చని కోరారు.

## ఆస్థాన వృద్దుల ఆశ్రమంలో అన్నదానం



**నెల్లూరు టౌన్, జూన్ 14, ప్రభాతవార్త :** రూడ్స్ చారిటబుల్ ట్రస్ట్, పీఎంపీ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో లితికారెడ్డి మొదటి జన్మదినాన్ని పురష్కరించుకుని పాప తల్లిదండ్రులు వెంకటరెడ్డి, యమున సమక్షంలో నెల్లూరులోని ఆస్థాన వృద్దుల ఆశ్రమంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా హాజరైన పీఎంపీ గౌరవ అధ్యక్షులు అనుములు జయప్రకాష్ మాట్లాడుతూ నేటి సమాజంలో ప్రజలు వసుదైక కుటుంబం నుండి ఒంటరి జీవితాలకు అలవాటు పడుతున్నారని, ఈ నేపధ్యంలో మనిషికి, మనిషికి మధ్య దూరం పెరిగిపోతూ ఉందని అన్నారు. లితికారెడ్డి జన్మదినాన్ని తన తల్లిదండ్రులు వృద్దుల ఆశ్రమంలో నిర్వహించడం ఎంతో హర్షించదగ్గ విషయమని, మొదటి జన్మదినం నుండి పాపను సమాజ సేవ పట్ల బాధ్యతను పెంచుతున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో పీఎంపీ అసోసియేషన్ అధ్యక్షులు శాఖవరపు వేణుగోపాల్, రూడ్స్ చారిటబుల్ ట్రస్టు చైర్మన్ షేక్ రసూల్, పాప నానమ్మ, తాతయ్య జగన్నాధరెడ్డి, కళావతి, రమాదేవి, ముక్తియార్ శ్రీనివాస్‌రెడ్డి, పీఎంపీ డివిజన్ అధ్యక్షులు గోరంట్ల శేషయ్య, ఎస్సీ,ఎస్టీ, బీసీ మైనార్టీస్ యునైటెడ్ ఫోరం రాష్ట్ర అధ్యక్షులు కుడుముల సుబ్బారావు, ఏఎస్ఐ మహబూబ్‌భాషా తదితరులు పాల్గొన్నారు.

## విచ్చలవిడిగా కాలం చెల్లిన కూల్ డ్రింక్స్

**ఉలవపాడు, జూన్ 14, ప్రభాతవార్త :** మండల కేంద్రమైన ఉలవపాడులో కాలం చెల్లిన కూల్ డ్రింగ్ తాగి ప్రజలు అనారోగ్యాల భారిన పడుతున్నారు. రెండు రోజుల కిందట భీమవరంలోని యువకులు ఉలవపాడులో కూల్ డ్రింకన్స కొనుగోలు చేయగా అమ్మకం తేదీ గడువు ముగిసిన బాటిళ్లను గుర్తించి దుకాణదారులను ప్రశ్నించారు. వారికి దీనిపై అవగాహన లేకపోవడంతో తెల్లబోయారు.

## పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణ

**ఉలవపాడు, జూన్ 14, ప్రభాతవార్త :** మెస్సర్స్ డిఆర్ ఆగ్రో కెంఫార్మ్స్ ఎల్ఎల్‌పీ వారు ఉలవపాడు మండలంలోని కే.రాజుపాలెంలోని సర్వే నెంబరు 344–1ఏ1బీ వద్ద 2.91 ఎకరాల విస్తీర్ణంలో సింగిల్ సూపర్ ఫాస్ఫేట్ తయారు చేయు యూనిట్‌ని స్థాపించాలని ప్రతిపాదనకు సంబంధించి ఈనెల 15న ఉదయం 11గంటలకు పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణ జరుపబడును.

## మురళీ కుటుంబాన్ని పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే ప్రసన్న కుమార్‌రెడ్డి



**బుచ్చి జూన్ 14 ప్రభాతవార్త :** బుచ్చిరెడ్డిపాళెం మండలంలోని జొన్నవాడ గ్రామంలో వైసిపి నాయకులు పిళ్ళళ్ళమురళీ కుటుంబాన్ని మాజీ ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి, యువనాయకులు రజిత్‌కుమార్‌రెడ్డి, మాజీ వ్యవసాయ మండలి చైర్మన్ దొడ్డంరెడ్డి నిరంజన్‌రెడ్డి పరామర్శించారు. మురళీ కుటుంబంపై దాడి చేయడం దారుణమని మాజీ ఎమ్మెల్యే ఖండించారు. టిడిపి నాయకులకు ఇటువంటి సంస్కృతి మంచిది కాదని అన్నారు. వైసిపి నాయకులకు తాను అండగా నిలబడతానని ఎమ్మెల్యే ధైర్యం చెప్పారు. ఈకార్యక్రమంలో వైసిపి మండల పార్టీ అద్యక్షులు చెర్లో సతీష్‌రెడ్డి, మండల ఉపాధ్యాక్షులు బాలకృష్ణా, పలువురు వైసిపి నాయకులు ఆయన వెంట ఉన్నారు.

## జెబి విద్యార్థి పూజిత జాతీయ సమైఖ్య శిబిరానికి ఎంపిక



కావలి రూరల్, జూన్ 14 ప్రభాతవార్త కావలి జవహర్ భారతి డిగ్రీ కళాశాలలో తృతీయ సంవత్సరం చదువుతున్న యం.పూజిత జాతీయ సేవా పథకం(ఎన్ఎస్ఎస్) ద్వారా జాతీయ సమైఖ్య శిబిరానికి విక్రమ యూనివర్శిటీ తరపున ఎంపికైంది. ఈ సందర్భంగా కళాశాల యాజమాన్యం విద్యార్థి యం.పూజితకు అభినందనలు తెలిపారు. ఈ నెల 14వ తేది నుండి 20వ తేది వరకు కర్ణాటక రాష్ట్రంలోని బెంగుళూరు సిటీ యూనివర్శిటీలో ఎన్ఎస్ఎస్ జాతీయ సమైఖ్య శిబిరం నిర్వహిస్తున్నారు. ఈ శిబిరంలో పాల్గొంటున్న పూజితను శుక్రవారం కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఆర్.మాల్యాద్రి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్స్ పి.భాస్కర్‌రావు, షేక్ ఆయుబ్ అహ్మద్, అధ్యాపకులు పుష్పగుచ్చాన్ని అందజేసి అభినందించారు.

## రాంప్రసాద్ రెడ్డిని కలిసిన బీద



**నెల్లూరు,జూన్ 14, ప్రభాతవార్త – వైద్యం** తెలుగుదేశం పార్టీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలో నూతనంగా ఏర్పాటైన మంత్రివర్గంలో స్థానం దక్కించుకున్న రాజంపేట శాసనసభ్యుడు రాంప్రసాద్ రెడ్డిని విజయవాడలోని శుక్రవారం టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి బీద రవిచంద్ర యాదవ్, శాసన మండలి సభ్యులు భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డిలు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛంతో శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం వారు కాసేపు పలు విషయాలపై చర్చించుకున్నారు.

## ఎమ్మెల్యేకి శుభాకాంక్షలు తెలిపిన మెడికవర్ సిబ్బంది



**నెల్లూరు, జూన్ 14, ప్రభాతవార్త – వైద్యం** జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో మూడవసారి నెల్లూరు రూరల్ శాసనసభ్యుడిగా ఎన్నికై హ్యాట్రిక్ సాధించిన శ్రీ కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డిని నెల్లూరు మెడికవర్ హాస్పిటల్స్ సిబ్బంది కలిసి శుక్రవారం నగరంలోని నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కార్యాలయంలో శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డిని వారు ఘనంగా సత్కరించారు. శాసనసభ్యుడు శ్రీధర్ రెడ్డిని కలిసి సత్కరించిన వారిలో మెడికవర్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ సెంటర్ హెడ్ డాక్టర్ ధీరజ్ రెడ్డి, మెడికవర్ క్యాన్సర్ ఇన్స్టిట్యూట్ సెంటర్ హెడ్ డాక్టర్ బిందు రెడ్డి, మార్కెటింగ్ మేనేజర్ సతీష్ బాబు, పిఆర్ఓ చందు వర్మలు వున్నారు.

## కందుకూరు సబ్‌కలెక్టర్ విధ్యాధరిని కలిసిన ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు



**కందుకూరు,జూన్ 14,ప్రభాతవార్త :** కందుకూరు సబ్‌కలెక్టర్ విధ్యాధరిని శుక్రవారం కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు మర్యాదపూర్వకంగా కలిశారు.నూతన ప్రభుత్వం కొలువుతీరిన నేపధ్యంలో కందుకూరు అబివృద్ధికి కృషి చేయాలని కలిసికట్టుగా ప్రజా సమస్యల పరిష్కారానికి తోడ్పాటు అందించాలని కోరారు. ఎమ్మెల్యేకు ఆమె ఈ సందర్భంగా అబినందనలు తెలిపారు.

## జిల్లా పోలీస్ కార్యాలయంలో పోలీస్ వెల్ఫేర్ డే



**నెల్లూరు క్రైం, జూన్ 14, ప్రభాతవార్త** జిల్లాలోని పోలీసు సిబ్బంది సంక్షేమమే ప్రధమ కర్తవ్యంగా భావించి జిల్లా పోలీస్ కార్యాలయంలో శుక్రవారం ఎస్పి ఆరిఫ్ హాఫీజ్ పోలీస్ వెల్ఫేర్ డే నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఎస్పి అర్జీలను స్వయంగా స్వీకరించి, సిబ్బందితో ముఖాముఖిగా మాట్లాడి సమస్య పరిష్కరిస్తానని హామీని ఇచ్చారు. పారదర్శకతతో కోరుకున్న చోటుకే ఖాళీల ఆదారంగా పలువురు సిబ్బందిని బదిలీ చేశారు. ఈ సందర్భంగా ఎస్పి మాట్లాడుతూ పోలీస్ సిబ్బంది అంకితభావంతో విధులు నిర్వహించాలని, అనధికారికంగా గౌర్హాజరు కావద్దని హెచ్చరించారు. వృత్తి పరమైన, ఆరోగ్యపరమైన, మహిళా కానిస్టేబుల్స్ సమస్యల అర్జీలపై సత్వరమే పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని హామీనిచ్చారు. డీపివో పరిపాలన విభాగ అధికారులకు ఆయా సమస్యలకు త్వరితగతిన పరిష్కారం చూపేందుకు తగు ఆదేశాలు, సూచనలు చేశారు. బదిలీలు గ్రేడ్ ఇంక్రీమెంట్ బదిలీలు, సస్పెండ్ నుండి రిలీవ్, సర్వీసు సంబంధిత సమస్యలు, డిప్యుటేషన్, భద్రత, ఆరోగ్య భద్రత, హౌసింగ్ లోను, అనారోగ్య కారణంగా బదలాయింపు సంబంధిత ఆపరిష్కృతంగా ఉన్న సమస్యలకు అర్జీలు స్వీకరించారు. సిబ్బందికి, వారి కుటుంబ సభ్యులకు రావాల్సిన ఆర్థిక ప్రయోజనాలకు సంబంధించి అపరిష్కృతంగా ఉన్న పనులను తక్షణమే పరిష్కారం నిమిత్తం, తగిన సూచనలు చేసి వెంటనే పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు.

## గేదెలను ఢీకున్న పేపర్ వ్యాను ఇద్దరు వ్యక్తులు,రెండు గేదెలు మృతి





**సంగం జూన్ 14 ప్రభాతవార్త** సంగం మండలం ముంబాయి రహదారిలో దువ్వూరు వద్ద జాతీయ రహదారిపై వేకోజామున పేపర్ వ్యాను రెండు గేదెలు ఢీకొట్టింది. సంగం వైపు వెళుతున్న సమయంలో ఈ సంఘటన జరిగినట్లు తెలిపారు. ఈ సంఘటనలో నాగరాజు అనే వ్యక్తి అక్కడిక్కడే మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. మార్గ మద్యంలో డ్రైవర్ శ్రీనివాసులు కూడా మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. అలాగే రెండు గేదెలు మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు.కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## ప్రత్యేక పూజలు నిర్వహించిన వేమిరెడ్డి



కోవూరు, జూన్14ప్రభాతవార్త : కోవూరు మండలం గుమ్మలదిబ్బ గ్రామంలోని శ్రీ కోదండ రామ స్వామి దేవస్థానంలో శుక్రవారం సీతారాముల కళ్యాణ కార్యక్రమాన్ని ఆలయ రుత్వికులు జనార్ధన్ సత్యనారాయణ స్వామి ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా నిర్వహించారు కళ్యాణం కార్యక్రమానికి కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై రుత్వికుల ఆశీస్సులు పొందారు. అనంతరం కోదండరామ స్వామి దేవస్థానంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ ప్రాంతంలో కూడా ఆ ప్రాంత టీడీపీ నాయకులు, కార్యకర్తలు శాలువా, పూలమాలతోఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి ఘనంగా సత్కరించి సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఇంతా మల్లారెడ్డి, మల్లికార్జున్‌రెడ్డి, దువ్వూరు కళ్యాణ్‌రెడ్డి, కోడూరు కమలాకర్‌రెడ్డి, దండి సతీష్, మాజీ ఎంపీపీ వై. వెంకటరమణమ్మ, ఆ ప్రాంత టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.




## ఆర్టీసి బస్సు - స్కూటర్ ఢీ వ్యక్తికి తీవ్రగాయాలు



పొదలకూరు, జూన్ 14, ప్రభాతవార్త ఆర్టీసీ బస్సు మోటార్ బైక్ ఢీకొన్న ప్రమాదంలో స్కూటరిస్టు తీవ్రంగా గాయపడ్డారు. ఈ సంఘటన పొదల కూరు పట్టణంలోని నెల్లూరు – పొదలకూరు ప్రధాన రహదారిలో పాత పెట్రోల్ బంకు వద్ద శుక్రవారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. నెల్లూరు నుండి వస్తున్న కలవాయి – సోమశిల ఆర్టీసి బస్సు రాపూరు మండలం తెగచర్ల నుండి నెల్లూరు వైపు వెళ్తున్న స్కూటరిస్టు శివానందరెడ్డిని ఢీకొంది. ఈ ప్రమాదంలో శివానంద రెడ్డి కుడికాలు మోకాలు విరిగింది. స్థానికులు వవెంటనే 108కి సమాచారం అందించారు. సంఘటన స్థలానికి చేరుకున్న 108 వాహనం హుటాహుటిన క్షతగాత్రుడిని పొదలకూరు సామాజిక వైద్యశాలకు తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. రోడ్డు ప్రమాదంలో గాయపడిన శివానందరెడ్డి డ్రైవర్‌గా పనిచేస్తున్నారు. శుక్రవారం తన విధులకు వెళ్ళాల్సింది. కానీ ఈ ప్రమాదంలో మోకాళ్ళు విరగడంతో తన జీవనోపాధి కోల్పోయాడు. ప్రభుత్వం అతని ఆదుకోవాలని స్థానికులు కోరారు.



















## రామానారాయణ రెడ్డికి శుభాకాంక్షలు తెలిపిన గంధం



**నెల్లూరు, జూన్ 14, ప్రభాతవార్త** రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయ ణరెడ్డిని శుక్రవారం నగరంలోని సంతపేటలో ఉన్న ఆయన నివాసంలో తెలుగుదేశం పార్టీ నెల్లూరు పార్లమెంటు బిసి సెల్ కార్యదర్శి గంధం అంకయ్య మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం రామనారాయణ రెడ్డికి శాలువా కప్పి పుష్పగుచ్చాన్ని అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

## గ్రామాలలో ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా శాంతిభద్రతలకు సహకరించాలి



**బిట్రగుంట, జూన్ 14 ప్రభాతవార్త** గ్రామాలలో ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా శాంతిభద్రతలకు సహకరించాలని కావలి డిఎస్పీ వెంకట రమణ పిలుపునిచ్చారు. బోగోలులో మండలంలోని సమస్యాత్మక గ్రామాలలో సార్వత్రిక ఎన్నికల అనంతరం శుక్రవారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్నికల అనంతరం వర్గ వైషమ్యాలు లేకుండా అందరూ కలిసి కట్టుగా సోదరభావంతో మెలగాలని కోరారు. పార్టీలకతీతంగా, వివాదాలకు దూరంగా వుండాలని హెచ్చరించారు. లేనిపక్షంలో గొడవలలో దొరికితే కఠిన శిక్షలు అమలు చేయాల్సి వస్తుందని హెచ్చరికలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట కావలి రూరల్ సిఐ నాగభూషణం, బిట్రగుంట ఎస్ఐ భోజ్య, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఇక స్మార్ట్ సిటీ జాబితాలో నెల్లూరు నగరం

రాష్ట్రం అభివృద్ధి పదంలో పరుగులే

మున్సిపల్ అర్బన్ డెవలప్మెంట్ శాఖ మంత్రిగా


నెల్లూరు నగర శాసనసభ్యులు డాక్టర్ పొంగూరు నారాయణ

త్వరలో నెరవేరునున్న నెల్లూరు ప్రజల చిరకాల కోరిక

**నెల్లూరు, జూన్ 14, ప్రభాతవార్త – వైద్యం** ఇక నెల్లూరు నగరం స్మార్ట్ సిటీగా రూపుదిద్దుకోనుంది. నెల్లూరు ప్రజల చిరకాల కోరిక నెరవేరానుంది. రాష్ట్రంలో ముఖ్యంగా పట్టణ ప్రాంతాలు సర్వతో ముఖాభివృద్ధి దిశ అడుగులయ్యను న్నాయి. మున్సిపల్ అర్బన్ డెవలప్మెంట్ శా ఖ మంత్రిగా నిరంతర శ్రామికుడు, అపర చాణుక్యడు అభివృద్ధి ప్రధాత.. విద్యావంతుడు.. నెల్లూరు నగర శాసనస భ్యు లు డాక్టర్ పొంగూరు నారాయణ బా ధ్యతలు చేపట్టనున్నారు. అభివృద్ధి అంటే నారాయణ.. నారాయణ అంటే అభివృద్ధి అన్న నినాదంతో ప్రజల్లో మంచి పేరును నారాయణ తెచ్చుకున్నారు. నెల్లూరు ప్రజల చిరకాల కోరిక అయిన అండర్ గ్రౌండ్ డ్రైనేజీ రక్షిత త్రాగునీరు అందుబాటులోకి రానున్నాయి. దోమల రహిత నగరంగా నెల్లూరు ఖ్యాతి గడించనుంది. గతంలో మున్సిపల్ శాఖ మంత్రిగా నెల్లూరు నగరాన్ని ఎంతగానో అభివృద్ధి పరచిన డాక్టర్ పొంగూరు నారాయణ తిరిగి అదే శాఖ ఆయనను వరించింది. పట్టు వదలని విక్రమార్కుడిలా తనకు అందివచ్చిన అవకాశాన్ని తిరిగి సద్వినియోగం చేసుకునేందుకు నారాయణ అహర్నిశలు కష్టపడతారనడంలో ఎలాంటి సందేహం లేదు.



ఎన్నికల ప్రచారం సందర్భంగా ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకున్న ఆయన ఇప్పటీకి అందుకు సంబంధించిన ప్రణాళికలను రూపొందించుకున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సహకారంతో రాష్ట్రాన్ని అభివృద్ధి వైపు పరుగులు పెట్టించడమే కాకుండా నెల్లూరు నగరాన్ని అతి త్వరలో స్మార్ట్ సిటీగా మార్చనున్నారు. మున్సిపల్ అర్బన్ డెవలప్మెంట్ శాఖ మంత్రిగా డాక్టర్ పొంగూరు నారాయణను నియమించడం పట్ల జిల్లాలో హర్షాతిరేకలు వ్యక్తమవుతున్నాయి.




## ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్లను కలిసిన శివాజీ



ఉదయగిరి, జూన్14, ప్రభాతవార్త మండలకేంద్రమైన ఉదయగిరిలోని ఉద్యోగుల సంఘం ఆధ్యక్షులు శివాజీ శ్రీహరి ఉయదగిరి నియోజకవర్గం ఎమ్మెల్యే కాకర్ల సురేష్‌ను మర్యాదపూర్వకంగా కలిసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉదయగిరి నియోజకవర్గంలోని ఉద్యోగస్తుల సమస్యలను ఆయన దృష్టికి తీసుకుని వెళ్లినట్లు ఆయన తెలి పారు .అందుకు సానుకూలంగా స్పందించిన ఆయన త్వరలోనే అన్ని సమస్యల మీద పరిష్కార దిశగా అన్ని ఉద్యోగస్తుల సం ఘాలతో సమావేశం ఏర్పాటు చేసి ముఖాముఖిగా వారితో మాట్లాడతానని తెలిపారు. మండలస్థాయిలో ఎలాంటి సమస్యలున్నా తన దృష్టికి నేరుగా ఉద్యోగులు తీసుకురావచ్చని అందుకు తాను ఎల్లప్పుడూ ఉద్యోగులకు అందుబాటులో ఉంటానని తెలిపినట్లు ఉద్యోగస్తుల సంఘం అధ్యక్షులు శివాజీ తెలిపారు. ఈ కార్యక్ర మంలో ఉద్యోగ సంఘ నాయకులు రియాజ్, ఇలియాజ్, అంజాద్, రామ్మోహన్, వెంకట్రావు, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.